
# టైమ్స్ ఆఫ్ వార్త

ఎడిటర్ : గూడూరు జనార్ధన్ రెడ్డి

తెలుగు దినపత్రిక

తెలంగాణ | బుధవారం, 15- మే - 2024 | సంపుటి : 16 | సంచిక : 304 | పేజీలు 06 | వెల : 6/-


## వచ్చే పదేళ్లూ రాష్ట్ర పాలనలోనే ఉంటా



- రైతు సంక్షేమ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రుణం తీసుకుంటాం.. దాని ద్వారానే రైతు రుణమాఫీ
- సన్న వడ్లు పండిస్తేనే రూ.500 బోనస్
- రైతుల పంట ఉత్పత్తులు సేకరించి రేషన్ షాపుల ద్వారా పేదలకు సరఫరా
- ఫోన్ ట్యాపింగ్‌పై అసెంబ్లీలోనే చెబుతాం
- రాష్ట్రంలో 13 పార్లమెంటు స్థానాల్లో గెలుస్తాం
- మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

**టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :**

వచ్చే పదేళ్లూ రాష్ట్ర పాలనలోనే ఉంటా.. రాష్ట్రంలో రైతు సంక్షేమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆ కార్పొరేషన్ ద్వారా ఆదాయం చూపించి రుణం తీసుకుంటామని, దాని ద్వారానే రైతుల రుణమాఫీ అమలు చేస్తామని ప్రకటించారు. ముందుగా తడిసిన ధాన్యం కొనుగోలు చేయడంపై, పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంపై ఫోకస్ చేస్తామన్నారు. వీటితోపాటు రైతు రుణమాఫీ అంశం, విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో పాఠ్యపుస్తకాలు, పాఠశాలల్లో సంస్కరణలు, హాస్టళ్లకు సన్నబియ్యం సరఫరా వంటి వాటిపైనా దృష్టి సారిస్తామన్నారు. పాలనలో భాగంగా ఆకస్మిక తనిఖీలు, పర్యటనలు కూడా ఉంటాయని చెప్పారు. రుణమాఫీకి సంబంధించి త్వరలోనే ఎస్ఎల్‌బీసీ సమావేశాన్ని ఏర్పాటు చేసి రైతులకు ఎంత మేరకు రుణాలు ఉన్నాయన్నది అంచనా వేస్తామన్నారు. రైతుల రుణాలను బ్యాంకుల నుంచి ప్రభుత్వం బదలాయించుకునేందుకు ఆర్‌బీఐ అంగీకరించబోదన్న మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలపై స్పందిస్తూ.. ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి లోబడి రుణం తీసుకుంటే ఆర్‌బీఐ ఎందుకు అంగీకరించదని ప్రశ్నించారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, ధరణి తదితరాలన్నింటిపైనా శాసనసభలో చర్చిస్తామని, సభలో చర్చకు పెట్టకుండా ఏదీ చేయబోమని స్పష్టం చేశారు. అఖిలపక్షాలు, స్టేక్ హోల్డర్లతోనూ చర్చిస్తామన్నారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు.. కేంద్ర బడ్జెట్ సమావేశాల తర్వాతే ఉంటాయని, కేంద్రం నుంచి వచ్చే నిధుల వెసులుబాటును చూసుకునే రాష్ట్ర బడ్జెట్ ఉంటుందని వెల్లడించారు. అందుకే రైతు రుణమాఫీకి ఆగస్టు 15 గడువు పెట్టుకున్నట్లు చెప్పారు.

### రేషన్ షాపుల ద్వారా పంటల పంపిణీ..

రైతులు పండించే వరి, ఇతర పంటలను పౌరసరఫరాల సంస్థ ద్వారా గిట్టుబాటు ధర ఇచ్చి సేకరిస్తామని, వాటిని ఉత్పత్తుల కింద మార్చి రేషన్ షాపుల ద్వారా పేదలకు పంపిణీ చేస్తామని సీఎం తెలిపారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం.. రేషన్ షాపుల ద్వారా బియ్యంతోపాటు తొమ్మిది రకాల వస్తువులను సరఫరా చేసిందని గుర్తు చేశారు. రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూ.. రైతులు ఆ వడ్లు పండించేలా ప్రోత్సహిస్తామని చెప్పారు. సన్న వడ్లు పండించే రైతులకు క్వింటాలుకు మద్దతు ధరపై రూ.500 బోనస్ ఇచ్చి సేకరిస్తామని చెబుతామన్నారు. అప్పుడు రైతులు కూడా సన్న వడ్లు పండించేందుకు ముందుకొస్తారని తెలిపారు. రేషన్ కార్డుల మంజూరు అనేది నిరంతర ప్రక్రియ అని సీఎం రేవంత్ అన్నారు. వీటితోపాటు అన్ని కార్యక్రమాలకు సంబంధించి గ్రామసభల్లో తీసుకున్న దరఖాస్తులను కంప్యూటరైజ్ చేసినట్లు చెప్పారు. రిటైర్ అయి కూడా వివిధ శాఖల్లో కొనసాగుతున్న అధికారులు వెయ్యి మందికి పైగా ఉన్నారని వెల్లడించారు. మంత్రివర్గ సమావేశం నిర్వహించి వారి విషయంలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. కర్ణాటకలో కరువు పరిస్థితులున్నా.. వారిని ఒప్పించి రాష్ట్రంలో తాగునీటి అవసరాల కోసం రెండున్నర టీఎంసీల కృష్ణా నీటిని ఆ రాష్ట్రం నుంచి తెచ్చామని గుర్తు చేశారు. 59 జీవోను అబయన్స్‌లో పెట్టామని, ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత సమీక్షిస్తామన్నారు.

మిగతా 4లో..

## ఢిల్లీలో కుస్తీ.. గల్లీలో దోస్తీ..




- తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ కలిసిపోయాయి
- బీజేపీని గెలిపించడానికి శ్రమించిన రేవంత్
- ఆరేడు చోట్ల కాంగ్రెస్ తరఫున డమ్మీ అభ్యర్థులు
- కేసీఆర్ బస్సుయాత్రతో రాజకీయాల్లో మలుపు
- దేశంలో రెండు కూటములకూ మెజారిటీ రాదు
- ప్రాంతీయ పార్టీలదే నిర్ణయాత్మక పాత్ర: కేటీఆర్

**టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :**

తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ కలిసిపోయాయని, ఆ రెండు పార్టీల వ్యవహారం ఢిల్లీలో కుస్తీ.. గల్లీలో దోస్తీ అన్నట్లుగా ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలో ఆరేడు పార్లమెంటు స్థానాల్లో కాంగ్రెస్ బలహీనమైన, డమ్మీ అభ్యర్థులను నిలబెట్టిందని అన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడైన జీవన్‌రెడ్డి కరీంనగర్‌లో పోటీ చేయాలనుకుంటే.. ఆయనను బలవంతంగా నిజామాబాద్‌లో పోటీ చేయించారని తెలిపారు. కరీంనగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి ఎవరో కూడా ప్రజలకు తెలియదని ఎద్దేవా చేశారు. ఇక సికింద్రాబాద్ అభ్యర్థి చివరి పది రోజుల్లో ప్రచారం కూడా చేయలేదని, మల్కాజిగిరి అభ్యర్థి ఆ ప్రాంతానికి సుపరిచితులు కాదని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ తరఫున డమ్మీ అభ్యర్థులను పెట్టి బీజేపీని గెలిపించడానికి కిషన్‌రెడ్డి కంటే ఎక్కువ కష్టపడ్డారని అన్నారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కేటీఆర్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ, కాంగ్రెస్ సారథ్యంలోని ఇండియా కూటముల్లో దేనికీ స్పష్టమైన మెజారిటీ వచ్చే పరిస్థితుల్లేవని, ప్రాంతీయ పార్టీలదే హవా అని పేర్కొన్నారు. ఏ కూటమిలోనూ లేని బీఆర్ఎస్, వైసీపీ, బిజూ జనతాదళ్ వంటి ప్రాంతీయ శక్తులు నిర్ణయాత్మక పాత్ర పోషించబోతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో 17 సీట్లలోనూ బీఆర్ఎస్ గట్టీ పోటీ ఇచ్చిందని, రెండు నెల ల కాలంలోనే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు గులాబీ సైనికులు ముచ్చెమటలు పట్టించారని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ చేపట్టిన బస్సుయాత్ర రాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పిందని, రెండు జాతీయ పార్టీల నాయకులు తెలంగాణ చుట్టూ గింగిరాలు కొట్టక తప్పని పరిస్థితిని కల్పించిందని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ మంచి ఫలితాలు సాధించబోతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ వంద రోజుల్లో అమలు చేస్తామన్న ఆరు గ్యారెంటీలను తుంగలో తొక్కడంతో ఆ పార్టీ పట్ల ప్రజల్లో తీవ్రవ్యతిరేకత కనిపించిందన్నారు. ఐదు నెలలుగా ప్రభుత్వాన్ని కాంగ్రెస్.. టైంపాసగా నడిపిందని ఆరోపించారు. ఇక బీజేపీ తరఫున గత ఎన్నికల్లో నలుగురిని ఎంపీలుగా గెలిపించినా.. వారితో ఒరిగిందేమీ లేదనే విషయం ప్రజలకు అర్థమైందన్నారు. కాగా, నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నేపథ్యంలో బీఆర్ఎస్ ముఖ్యనేతలు, ప్రజాప్రతినిధులతో కేటీఆర్ బుధవారం తెలంగాణ భవన్‌లో భేటీ కానున్నారు.

## వారంలో నైరుతి!

- ఈ నెల 19కల్లా అండమాన్‌ను తాకనున్న రుతుపవనాలు: ఐఎండీ
- నేడు, రేపు రాష్ట్రంలో అక్కడక్కడ వర్షాలు
- జైనాలో అత్యధికంగా 42.9 డిగ్రీలు

**టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :**




దేశ ప్రజలకు చల్లని కబురు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే వచ్చేస్తున్నాయి. భారత వాతావరణ కేంద్రం(ఐఎండీ) అంచనాల ప్రకారం నైరుతి రుతుపవనాలు మే 19 నాటికి దక్షిణ అండమాన్, ఆగ్నేయ బంగాళాఖాతంలోని పలు ప్రాంతాలను తాకనున్నాయి. నైరుతి రుతుపవనాలు ఏటా మే 22న దక్షిణ అండమాన్ సముద్రంలోకి ప్రవేశిస్తుంటాయి. కానీ ఈసారి మూడు రోజులు ముందుగానే వస్తున్నాయి. రుతుపవనాలు గతేడాది కూడా మే 19 నాటికి అండమాన్ చేరుకున్నప్పటికీ ఆ తర్వాత వాటి కదలికలు మందగించాయి. ఈ ఏడాది పరిస్థితి ఎలా ఉంటుందో వేచి చూడాలి. ఇక, బుధ, గురువారాల్లో తెలంగాణలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ ప్రాంతీయ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్- మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో బుధవారం వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. కాగా, జగిత్యాల జిల్లా జైనాలో మంగళవారం 42.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

## పెరిగిన పోలింగ్ శాతం

- ఎవరికి లాభం.. ఎవరికి నష్టం
- ప్రధాన పార్టీల నేతల్లో అంతర్మథనం

**టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :**




రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల్లో మెజార్టీ సీట్లు సాధించడమే లక్ష్యంగా మూడు ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ హోరాహోరీగా ప్రచారం నిర్వహించాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ బిజెపి, రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన పార్టీ కాంగ్రెస్, రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన బిఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. గతంతో పోలిస్తే ఈసారి పోలింగ్ శాతం పెరిగింది. 2019 లోక్ సభ ఎన్నికల్లో 62.77 శాతం పోలింగ్ నమోదు కాగా,ఈ సారి 66.3 శాతం పోలింగ్ నమోదయ్యింది. సోమవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ 9 గంటల వరకు 9.51 శాతం మంది ఓట్లు వేశారు. ఆ తర్వాత పలు ప్రాంతాల్లో పుంజుకొని 11 గంటలకు పోలింగ్ శాతం 24.31 శాతానికి చేరుకుంది. మధ్యాహ్నం ఒంటిగంట వరకు 40.38 శాతం పోలింగ్ పెరిగింది. ఇలా క్రమంగా పెరుగుతూ మధ్యాహ్నం 3 గంటల వరకు 52.34 శాతానికి, సాయంత్రం 5 గంటలకు 61.16 శాతానికి పెరిగింది. సాయంత్రం 6 గంటల తర్వాత కూడా ఓటర్లు గంటల తరబడి క్యూ లైన్లలో నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సారి ఇంటి నుంచి ఓట్లు వేసిన వారు, పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్న వారితో కలిపి తుది ఓటింగ్ శాతం 66.3గా నమోదయ్యింది. ఆరు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికలతో పోల్చుకుంటే పోలింగ్ శాతం తగ్గడం, గత లోక్‌సభ పోల్చుకుంటే పెరగడం ఎవరికి లాభం చేస్తుంది..? ఎవరికి నష్టం చేస్తుందో అని ఆయా పార్టీల నేతలు అంతర్మథనం చెందుతున్నారు. ఆరు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సుమారు 71.34 శాతం పోలింగ్ నమోదు కాగా.. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో 62.77 శాతం పోలింగ్ నమోదైంది. గత పార్లమెంట్ ఎన్నికలతో పోల్చుకుంటే పెరిగిన పోలింగ్ శాతం తమకు ఏ మేరకు ప్రయోజనం చేకూరుస్తుందని అన్ని పార్టీలు ఆరా తీస్తున్నాయి. రాష్ట్రంలో లోక్‌సభ నియోజకవర్గాల వారీగా భువనగిరిలో అత్యధికంగా 76.47 శాతం పోలింగ్ నమోదు కాగా, అత్యల్పంగా ఎప్పటిలాగే హైదరాబాద్‌లో తక్కువ ఓటింగ్ నమోదైంది. నగరంలో 46.08 శాతం పోలింగ్ నమోదైంది. రెండు స్థానాలు మినహా మిగిలిన అన్ని సెగ్మెంట్లలో 2019 పార్లమెంట్ ఎన్నికల కంటే ఎక్కువగా పోలింగ్ శాతం నమోదైంది.

అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే ఆరు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టామని, అందుకే తమకు అనుకూలంగా పోలింగ్ నమోదైం దని కాంగ్రెస్ నాయకులు ధీమాతో ఉండగా, కేంద్రంలో మళ్లీ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రానికి మేలు జరుగుతుందని భావించి ప్రజలు తమకు అనుకూలంగా ఓటు వేశారని, అందుకే పెద్ద సంఖ్యలో పోలింగ్ జరిగిందని బిజెపి ధీమా వ్యక్తం చేస్తున్నది. తమ పాలనలో కరెంట్ కష్టాలు, సాగు, తాగు నీరుకు ఇబ్బందులు లేవని, కానీ, కాంగ్రెస్ ఆరు నెలల పాలనలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అందుకే తమకు అనుకూలంగా ఓటింగ్ జరిగిందని బిఆర్ఎస్ నాయకులు అంచనా వేస్తున్నారు.

# పాక్ సరిహద్దులో 49 డ్రోన్లు స్వాధీనం

## ఎంసిసి అమలు కాలంలో బిఎస్ఎఫ్ చర్య



న్యూఢిల్లీ : దేశంలో ప్రస్తుతం సాగుతున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల ప్రవర్తన నియమావళి (ఎంసిసి) అమలులో ఉన్న ఈ అరవై రోజుల్లో భారత్, పాకిస్తాన్ అంతర్జాతీయ సరిహద్దులో 49 డ్రోన్లను కూల్చివేయడమో, స్వాధీనం చేసుకోవడమో జరిగిందని తాజా డేటా వల్ల తెలుస్తోంది. పాకిస్తాన్ నుంచి ప్రయోగించిన, భారత పంజాబ్ ప్రాంతంలో, రాజస్థాన్‌లో ప్రవేశించిన, ప్రధానంగా ఈ చైనా తయారీ యుఎవిల స్వాధీనం 2022 దరిమిలా జనవరి, మే కాలంలో దాదాపు 13 రెట్లు అధికం అని తెలుస్తోంది. ఎన్నికల కమిషన్ (ఇసి) దేశంలో ఏడు దశల ఎన్నికల కార్యక్రమాన్ని ప్రకటించిన రోజు మార్చి 16న ఎంసిసి అమలులోకి వచ్చింది. 2289 కిలో మీటర్ల భారత్, పాకిస్తాన్ అంతర్జాతీయ సరిహద్దును కాపలా కాసే సరిహద్దు భద్రత దళం (బిఎస్ఎఫ్) రూపొందించిన, 'పిటిఐ' వార్తా సంస్థ విశ్లేషించిన డేటా ప్రకారం, మార్చి 16 నుంచి ఇప్పటి వరకు మొత్తం 49 డ్రోన్లను లేదా యుఎవిలను సరిహద్దు భద్రత సంస్థలు కూల్చివేయడం లేదా స్వాధీనం చేసుకోవడం జరిగింది. సరిహద్దు రాష్ట్రం పంజాబ్‌లో గరిష్ఠంగా 47 డ్రోన్ల స్వాధీనం జరిగింది. పంజాబ్‌లోని 13 లోక్‌సభ సీట్లకు జూన్ 1న ఒకే దశలో పోలింగ్ జరగనున్నది. 'భద్రతకు ముప్పు' అయిన ఆ డ్రోన్లలో తక్కిన రెండింటిని రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్, బికనేర్ సెక్టార్లలో సరిహద్దు పొడవునా స్వాధీనం చేసుకున్నారు. ఆ సరిహద్దులో కూడా బిఎస్ఎఫ్ కాపలా కాస్తుంటుంది. పంజాబ్‌లో అత్యధికంగా అమృత్‌సర్ సెక్టార్‌లోను, ఆ తరువాత ఫిరోజ్‌పూర్, గురుదాస్‌పూర్, అబొహార్‌లో స్వాధీనం చేసుకున్నట్లు డేటా సూచిస్తోంది. 'ఆ అక్రమ డ్రోన్లు డ్రగ్‌లు, ఆయుధాలు కూడా తెస్తున్నందున పాకిస్తాన్ సరిహద్దు పొడుగునా భద్రతకు తీవ్ర ముప్పు కలిగించే వాటిని కూల్చడానికి లేదా కనిపెట్టడానికి మానవ నిఘా, సాంకేతిక సాధనాలను ఉపయోగిస్తున్నాం. డ్రగ్‌లు, ఒక్కొక్కసారి ఆయుధాలను ప్రవేశపెట్టే ఆ యుఎవిల వల్ల ఎన్నికల ప్రక్రియ దెబ్బ తినకుండా చూసేందుకు మరింతగా నిఘా వేసి ఉంచాలన్న ఇసి ఆదేశాల దృష్ట్యా బిఎస్ఎఫ్, పంజాబ్, రాజస్థాన్ పోలీస్ వంటి సోదర సంస్థలు, వివిధ మాదకద్రవ్య నిరోధక విభాగాలు మొదలైనవి తమ యత్నాలను ముమ్మరం చేశాయి' అని పంజాబ్‌లో బిఎస్ఎఫ్ సీనియర్ అధికారి ఒకరు తెలియజేశారు.భారత, పాకిస్తాన్ అంతర్జాతీయ సరిహద్దు జమ్మూ కాశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్ పొడుగునా విస్తరించి ఉంది. పంజాబ్ ప్రాంతం పాకిస్తాన్‌తో 553 కిలో మీటర్ల సరిహద్దును కలిగి ఉంది. జమ్మూ ప్రాంతంలో 2020లో మొదలైన డ్రోన్ బెడద రికార్డు స్థాయిలో ఇంకా సాగుతూనే ఉంది.

# పక్కా లోకల్ హై బాయ్....

**ఎన్నికల ప్రచారం ముగిసింది నాయకులు వెళ్ళిపోయారు...,**

**ఓటింగ్ ముగిసింది, ఓటరు ప్రశాంతం...**

**కానీ అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడైనా నేను పక్కా లోకల్ అంటున్న పోచారం..**

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:





నిన్నటి వరకు ఎన్నికల బిజీతో క్షణం తీరిక లేకుండా ఉన్న మాజీ శాసనసభ సభాపతి, మాజీ మంత్రి, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస రెడ్డి మంగళవారం బాన్సువాడ పట్టణంలోని టీ స్టాల్ లో అలా ప్రశాంతంగా చాయ్ తాగుతూ ఎన్నికలు ఉన్నా లేకపోయినా నేను మాత్రం బాన్సువాడ లోకల్ అన్నారు.బాన్సువాడ పాత మున్సిపల్ కాంప్లెక్స్ లో ఉన్న ఇమ్రాన్ టీ స్టాల్ కు ఈరోజు స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులతో వెళ్లిన పోచారం ఇతర కస్టమర్ల తో పాటుగా చాయ్ తాగుతూ ముచ్చట్లు పెట్టారు.ఎలక్షన్లు వస్తాయ్, పోతోయ్..బయటి నాయకులు ఓట్లు అయిపోగానే వాళ్ళ ఊరికి పోతారు. నాకు మాత్రం బాన్సువాడే నా ఊరు, ఇదే నా ఇల్లు, బాన్సువాడ ప్రజలే నా కుటుంబం.. అంటూ చాయ్ ని ఆస్వాదించారు పోచారం ఆయన వెంట బాన్సువాడ సొసైటీ చైర్మన్ ఏరువాల కృష్ణారెడ్డి, బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ జంగం గంగాధర్, మాజీ బాన్సువాడ మార్కెట్ కమిటీ నార్ల రవీందర్ గుప్తా తో పాటు బారాస నాయకులు ఏ జాజ్, వాహబ్, నార్ల ఉదయ్ కుమార్ గుప్తా, వంకారి రమేష్ తో పాటు తదితర బారాస నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, ఉన్నారు.

# తెలంగాణలో మొట్ట మొదటి ఎంపెర్ నెక్సస్ ఎలక్ట్రిక్ వాహనాల(బైక్స్) షోరూం..

**ప్రముఖ టీవీ యాంకర్ గీతా భగత్ చేతుల మీదుగా ప్రారంభం...**

టైమ్స్ ఆఫ్ వార్త - కూకట్ పల్లి






తెలంగాణలో మొట్ట మొదటి ఎంపెర్ నెక్సస్ ఎలక్ట్రిక్ వాహనాల(బైక్స్) షోరూం, మూసాపేట్ హైదరాబాద్ లో ప్రారంభించినట్లు షోరూం యజమాని సంజయ్ తెలిపారు. మూసాపేట్-కూకట్పల్లి రోడ్ లో మెట్రో పిల్లర్ 848 వద్ద మంగళవారం ప్రముఖ టీవీ యాంకర్ గీతా భగత్ చేతుల మీదుగా ఎంపెర్ నెక్సస్ ఎలక్ట్రిక్ వాహనాల(బైక్స్) షోరూం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యాంకర్ గీతా భగత్ మాట్లాడుతూ భవిష్యత్ అంతా ఎలక్ట్రిక్ వాహనాల మయమైపోతుందని, పర్యావరణం బాగుండాలంటే తక్కువ ఉద్గారాలను విడుదల చేసే ఎలక్ట్రిక్ వాహనాలనే వాడవలసిన అవసరం వుందని ఆమె సూచించారు. ప్రస్తుతం నాలుగు అందమైన రంగులతో ఆకట్టుకునే ఎంపెర్ నెక్సస్ ఈవీ బైక్స్ అత్యాధునిక సాంకేతిక హంగులతో మార్కెట్‌లో ప్రవేశించిందని గీతా భగత్ ప్రశంసలు కురిపించారు. కేవలం మూడు గంటల ఇరవై నిమిషాలలో అత్యంత వేగంగా రీఛార్జ్ అవుతుందని అన్నారు. అందుబాటు బడ్జెట్ లో నాలుగు వేరియంట్ లలో ఎంపెర్ నెక్సస్ వాహనాలు అందుబాటులో వున్నాయన్నారు. తెలంగాణాలో ఈ తరహా షోరూం లలో యిదే మొదటిదని ప్రొప్రైటర్ సంజయ్ మీడియాకు వివరించారు. ఆధునిక హంగులతో ఆకట్టుకునే అందమైన రూపంలో అలరిస్తున్న ఎంపెర్ నెక్సస్ వాహనాల షోరూం ప్రతి ఒక్కరూ సందర్శించి ఎంపెర్ నెక్సస్ టెస్ట్ రైడ్ చేసి సుమారు 130 కి.మీ రేంజ్ తో మీ డబ్బు, సమయం ఆదా చేస్తున్న ఎంపెర్ నెక్సస్ ఈవీ బైక్స్ స్వంతం చేసుకోవాలని గీతా భగత్ వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు.

# మహబూబాబాద్ జిల్లాలో జర్నలిస్టులపై కొనసాగుతున్న దాడులు..

**జర్నలిస్ట్ అయోధ్య రామయ్య పై దాడి ఖండించిన జర్నలిస్ట్ సంఘాలు**

**నిందితులు పున్ని ప్రసాద్, వేల్పుల రాజులను వెంటనే అరెస్ట్ చేయాలి**

టైమ్స్ ఆఫ్ వార్త - మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి



మహబూబాబాద్ పోలింగ్ సరళిని పరిశీలించేందుకు వెళ్లిన తొలి సమయం దినపత్రిక ఎడిటర్ వి అయోధ్య రామయ్య పై దాడి చేసిన వారిని పోలీస్ కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని టిడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర కమిటీ కౌన్సిల్ భూపతి కాశయ్య గౌడ్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లాలో వరసగా జర్నలిస్ట్ సమాజంపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాల పట్ల ప్రజలు, ప్రజా స్వామిక వాదులు, జర్నలిస్ట్ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సిన సమయం ఆసన్నం అయిందని ఆయన పిలుపునిచ్చారు. లోక్ సభ ఎన్నికల సందర్భంగా మహబూబాబాద్ మండలం గాంధీ పురం గ్రామంలో ఎన్నికల వార్త కవరేజ్ కోసం ఆ గ్రామంలో పోలింగ్ బూత్ కు వద్దకు వెళ్లిన జర్నలిస్ట్ అయోధ్య రామయ్యపై అదే గ్రామానికి చెందిన వేల్పుల రాజు అతని అనుచరులు ఎదురయ్యారు.వేల్పుల రాజు, మహబూబాబాద్ వై. ఎస్. ఆర్. సి.పి కాలనికి చెందిన పున్ని ప్రసాద్ లు ఇద్దరు పథకం ప్రకారమే దాడికి తెగబడ్డారు. బైక్ ను ఎదురు పెట్టి కింద పడేసి విపరీతంగా కొట్టారని, దెబ్బలకు తాళలేక బైక్ వదిలి ప్రాణ భయంతో గ్రామం లోని ఓక ఆర్ ఎంపీ డాక్టర్ ఇంట్లోకి వెళ్లి తల దాచుకోగా ఆ ఇంట్లో నుండి బైటికి లాగి తిరిగి దాడీ చేసి రౌడీ ఇజం చేశారని భూపతి కాశయ్య గౌడ్ ఆవేదన వ్యక్తం చేసారు. దాడికి పాల్పడ్డ వేల్పుల రాజు, పున్ని ప్రసాద్ ల పై హత్య యత్నం నేరం క్రింద కేసు నమోదు చేయాలని, తక్షణమే విచారణ జరిపి అరెస్టు చేయాలని మహబూబాబాద్ రూరల్ పోలీస్ లని భూపతి కాశయ్య గౌడ్ డిమాండ్ చేశారు. జర్నలిస్ట్ అయోధ్య రామయ్య పై జరిగిన దాడిని ప్రజలు, ప్రజా స్వామిక వాదులు, జర్నలిస్ట్ లు, జర్నలిస్ట్ సంఘాలు ఖండించాలని ఆయన కోరారు.

# ఆదర్శంగా ఆ రెండు గ్రామాలు 100% పోలింగ్

**ఆ రెండు గ్రామాలకు మెదక్ జిల్లా, జగిత్యాల కలెక్టర్లు అభినందనలు**

టైమ్స్ ఆఫ్ వార్త - మెదక్ జిల్లా ప్రతినిధి



తెలంగాణలోని ఆ రెండు గ్రామాలు ప్రజాస్వామ్య విలువను చాటి చెప్పాయి.అక్కడి ఓటర్లు ఓటుతో తమ చైతన్యాన్ని చాటారు. లోక్సభ నాలుగో దశ ఎన్నికల్లో భాగంగా సోమవారం రాష్ట్రంలో పోలింగ్ జరిగింది. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలం చిన్న కొల్వాయిలో వంద శాతం పోలింగ్ నమోదైంది. మెదక్ జిల్లా కొల్చారం మండలం సంగాయిపేట తండాలో కూడా ఏకంగా 100 శాతం పోలింగ్ నమోదైంది. ఈ తండాలో ఏర్పాటు చేసిన 62ఏ అదనపు పోలింగ్ కేంద్రం పరిధిలో 210 మంది ఓటర్లు ఉండగా.. అందరూ ఓటు వేశారు. 95 మంది పురుషులు, 115 మంది మహిళ ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు పోలింగ్ సిబ్బంది వెల్లడించారు. దీంతో సంగాయిపేట తండా వాసులను మెదక్ కలెక్టర్ అభినందించారు. గ్రామంలో 110 మంది ఓటర్లు ఉండగా అందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవడం విశేషం. ఇలా వంద శాతం ఓటింగ్కు కృషి చేసిన సెక్టోరల్ ఆఫీసర్ శక్రు నాయక్, కార్యదర్శి ముద్దం విజయ, బీఎల్వో యశోద, రూట్ అధికారి రాజ్కుమార్ను కలెక్టర్ యాస్మిన్ బాషా ప్రత్యేకంగా అభినందించారు.

# నాకోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ పేరు పేరున హృదయపూర్వక ధన్యవాదాలు

**మానుకోట కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్**

టైమ్స్ ఆఫ్ వార్త - మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి



మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జెన్నరెడ్డి భరత్ చంద్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి శ్రీ పోరిక బలరాం నాయక్ మీడియాతో మాట్లాడారు. గత రెండు నెలలుగా నాకోసం, నా గెలుపు కోసం అహర్నిశలు కష్టపడిన మహబూబాబాద్ పార్లమెంటు ఇంచార్జి మంత్రి,పార్లమెంట్ పరిధిలోని 7 నియోజకవర్గ ఎమ్మెల్యేలకు, కాంగ్రెస్ నాయకులలకు,కార్యకర్తలకు, మిత్రపక్షాలకు,మీడియా మిత్రులకు ప్రతీ ఒక్కరికీ నా యొక్క హృదయపూర్వక ధన్యవాదాలు. జూన్ 4 న వెలువడే ఎన్నికల ఫలితాలలో తల్లి సోనియా గాంధీ ఆశీస్సులతో, మహబూబాబాద్ నియోజకవర్గ ప్రజల ఆదరాభిమానాలతో, వారి అండదండలతో, దీవెనలతో నేను ఎంపీగా గెలుస్తున్నాను. ప్రజల అభిమానమే నాకు బలం ఆ బలంతోనే అత్యధిక మెజారిటీతో మహబూబాబాద్ ఎంపీ గా గెలుస్తున్నాను, నా కోసం కష్టపడిన ప్రతీ ఒక్క కార్యకర్తకు అండగా ఉంటాను. ఈ సందర్భంగా మరోసారి ప్రజలందరికీ నా యొక్క హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ఈ సమావేశంలో మానుకోట ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్,డోర్నకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్ బ్లాక్ కాంగ్రెస్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# ఈవియంల కూ... పటిష్ట భద్రత

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్**

టైమ్స్ ఆఫ్ వార్త - మెదక్ జిల్లా ప్రతినిధి



సాధారణ ఎన్నికలు 2024 ,నిన్న జరిగిన మెదక్ పార్లమెంట్ లో ఉన్న 7 సెగ్మెంట్ల ఈవియం లను పటిష్ట భద్రత మధ్య భద్రపరచడం జరిగిందని కలెక్టర్ రాహుల్ రాజ్ వివరించారు. మంగళవారం నర్సాపూర్ బివిఆర్ఐటి కళాశాలలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను స్ట్రాంగ్ రూమ్లో భద్రపరచుట, సీల్ వేయడంలో భాగంగా సాధారణ పరిశీలకులు సమీర్ మాధవ్ కుర్కోటి, సమక్షంలో సంబంధిత నియోజకవర్గాల ఏఆర్వోలు రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ స్ట్రాంగ్ రూమ్ లో భద్రపరిచి సీల్ వేయడం జరిగిందన్నారు.దీనితో పాటు పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూం నకు కుడా సీల్ వేయడం జరిగిందని, ఎన్నికల కు సంబంధించిన పేపర్ మెటీరియల్ కు చెందిన స్క్రూటినీ రిపోర్ట్ లు, స్టాట్యూటరీ రిపోర్ట్ లు ఎన్నికల పరిశీలకుల సమక్షం లో సీల్ వేశామని అన్నారు. మంగళవారం ఎలక్షన్ పేపర్ స్ట్రాంగ్ రూం ను ఓపెన్ చేసి అబ్జార్వర్ అభ్యర్థుల తరపున వచ్చిన ప్రజా ప్రతినిధుల సమక్షం లో స్క్రూటినీ చేయడం జరిగిందని మెదక్ పార్లమెంట్ నియోజక వర్గ పరిధి లోని ఆయా అసెంబ్లీ సెగ్మెంట్ లలో అతి ఎక్కువ అతి తక్కువ పోలింగ్ జరిగిన పోలింగ్ కేంద్రాలు, ఈ వి ఎం లు, రీప్లేస్మెంట్ జరిగిన బూత్ లు వంటి వాటిని స్క్రూటిని చేసి పరిశీలించడం జరిగిందని, అన్ని అంశాలు కూడా ఏలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా సాఫీగా, విజయవంతం గా జరిగాయని నిర్ధారణకు రావడం జరిగిందని, అన్ని గణాంకాలు సరిపోవడం తో ఎక్కడ కూడా రీ-పోలింగ్ కు అవకాశం లేదని మెదక్ పార్లమెంట్ పరిధి లో ఎలాంటి రీ-పోలింగ్ కు అవకాశం లేకుండా ఎన్నికలు పూర్తి చేయడం జరిగిందని, పార్లమెంట్ సెగ్మెంట్ పరిధి లో మొత్తం .75.09 % పోలింగ్ నమోదు కావడం జరిగిందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వారిగా నమోదైన శాతం కూడా వెల్లడించడం జరిగిందని చెప్పారు. సీసీ టీవీకెమరాల మధ్య ,కేంద్ర ప్రభుత్వ సాయుధ దళాల పహారాలో భద్రపరుస్తున్నామన్నారు. గజ్వేల్, దుబ్బాక మెదక్,నర్సాపూర్,సిద్దిపేట నియోజకవర్గాల ఈ వి యం లను బవరిట్ ఇంజనీరింగ్ కళాశాలలో, సంగారెడ్డి , పటాన్చెరు నియోజకవర్గాల ఈ వి యం లను ప్రభుత్వ గిరిజన బాలుర జూనియర్ కళాశాలలో భద్రపరిచామని అన్నారు. మెదక్ పార్లమెంటు నియోజక వర్గ పరిదిలో అత్యధికంగా నర్సాపూర్ నియోజకవర్గం లో 84.25 శాతం నమోదు కాగా అత్యల్పంగా పటాన్చెరు నియోజకవర్గం లో 63.01 శాతం గా నమోదు అయిందన్నారు. గత 2019 పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల కంటే ఇప్పుడు 2024 లో దాదాపు 4 శాతం పైగా ఓటింగ్ పెరిగిందని కలెక్టర్ రాహుల్ రాజ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట అదరపు కలెక్టర్ గరిమ అగర్వాల్, జిల్లా ఎస్పీ బాల స్వామి,అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు,నియోజకవర్గాల ఏఆర్వోలు , డీఎస్పీలు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీ వెళ్లిన డిప్యూటీ సిఎం

**నేడు రాహుల్‌తో కలిసి ఒడిశాకు పయనం..ఎన్నికల ప్రచారంలో పాల్గొనున్న భట్టి**

**హైదరాబాద్ :** పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు మంగళవారం రాత్రి ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. బుధవారం ఆయన రాహుల్ గాంధీతో కలిసి ఒరిస్సా రాష్ట్రంలోని బోలంగిర్ లోక్ సభ పరిధిలో ప్రచారం నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం ఢిల్లీ నుంచి రాహుల్ గాంధీతో కలిసి ప్రత్యేక విమానంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బొలంగిర్ లోక్ సభ స్థానానికి చేరుకోనున్నారు. డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ఇప్పటికే ఒరిస్సా రాష్ట్రంలో మూడు దఫాలుగా ప్రచారం నిర్వహించారు. కటక్ లో ఒకరోజు, భువనేశ్వర్ లో రెండు రోజులపాటు, రాయగడ పార్లమెంటు పరిధిలో రెండు రోజులపాటు ఇప్పటికే ప్రచారం నిర్వహించారు. తాజాగా నాలుగోసారి ఒరిస్సా రాష్ట్రంలోని బోలంగిర్ పార్లమెంటు పరిధిలో ప్రచారం నిర్వహించనున్నారు

జనరల్ న్యూస్
GENERAL NEWS
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దినపత్రిక
బుధవారం,
15-05-2024


# స్ట్రాంగ్ రూమ్‌లకు చేరిన ఈ.వీ.ఎం లు

**పరిశీలకులు, ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్ లకు సీల్**

**సీ.సీ కెమెరాల ద్వారా అనుక్షణం పర్యవేక్షణ, సాయుధ బలగాల పహారా**

**144 సెక్షన్ నిషేధాజ్ఞలు అమలు**

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ కలెక్టరేట్



నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని 7 శాసనసభా నియోజకవర్గాలలో ప్రశాంత వాతావరణంలో సాఫీగా పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం, కట్టుదిట్టమైన భద్రత నడుమ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం)ను ఓట్ల లెక్కింపు కేంద్రమైన డిచ్పల్లిలోని సీఎంసీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ లకు చేర్చారు. ఆయా సెగ్మెంట్ల నుంచి తరలించిన ఈవీఎంలను జాగ్రత్తగా సరిచూసుకుని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా వాటిని స్ట్రాంగ్ రూంలలో నియోజకవర్గాల వారీగా క్రమపద్ధతిలో అమర్చారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలిస్ వజ్ ఆర్ తో పాటు, అభ్యర్థులు వారి ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్ లకు సీల్ వేశారు. పార్లమెంటు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్ ఈవీఎంల భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఎలాంటి గందరగోళం, లోటుపాట్లకు తావులేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఎలాంటి అనుమానాలకు తావులేకుండా స్ట్రాంగ్ రూంలతో పాటు వాటి పరిసరాలను అనుక్షణం పరిశీలించేందుకు వీలుగా సీ.సీ కెమెరాలను అమర్చి, మానిటర్ల ద్వారా పర్యవేక్షణ జరిపిస్తున్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ నిషేధాజ్ఞలు అమలులోకి తెస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, సీ.పీ కల్మేశ్వర్ ప్రతి కౌంటింగ్ హాల్, స్ట్రాంగ్ రూమ్ లను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, అధికారులకు సూచనలు చేశారు. జూన్ 4న చేపట్టనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది రాకపోకలకు, అభ్యర్థులు, ఏజెంట్ల రాకపోకల కోసం వేర్వేరు మార్గాలతో బారికేడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. తాగునీరు, విద్యుత్ సరఫరా, కౌంటింగ్ టేబుల్స్, ఇతర అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. కలెక్టర్ వెంట ట్రైనీ కలెక్టర్ సంకేత్ కుమార్, సహాయ రిటర్నింగ్ అధికారులు ఉన్నారు.

## ఘనంగా పిడమర్తి రవి జన్మదిన వేడుకలు

టైమ్స్ ఆఫ్ వార్త - జాజిరెడ్డిగూడెం



జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని అర్వపల్లి చౌరస్తాలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, ఓయూ జెఏసి కన్వీనర్ పిడమర్తి రవి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓయూ విద్యార్థి జేఏసీ కన్వీనర్ మీసాల మహేష్ మాట్లాడుతూ...తెలంగాణ విద్యార్థి ఉద్యమ రథసారథి అలనాడు ఉద్యమంలో అనేక కేసులు బనాయించినా ఉద్యమం ఊపిరిగా తన జీవితాన్ని త్యాగం చేసిన వ్యక్తి ఉద్యమకారులు పిడమర్తి రవి అని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు గోళ్ల వేణు, కళాకారుడు ఆకారపు నాగరాజు, చల్లా సత్యనారాయణ,రింగు విష్ణు,దేవరకొండ సందీప్, గుండ్లపల్లి రంజిత్ పాల్గొన్నారు.

## చాలా కష్ట పడ్డావు ఓ కార్యకర్త...

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:

రేఖదేదాకా డొక్కాడని పరిస్థితి ఓటర్లది, రేక్కలు లేకుండా ఆకాశం లో తిరిగే తల రాత నాయకులది. నాయకులు ప్రజల ఆలోచించరు ప్రజలు నాయుకుళ్ళ ఆలోచన చేయలేరు.బడా వాహనాలు వాళ్ళవి చోట బ్రతుకులు మనవి.పార్టీ ఏదైనా నాయకుడు ప్రజలను కుటుంబం అనే ఆలోచన చేయడు ఆలా ఆలోచించినవాడిని మనమే నాయకుడిగా చేయము.ఓట్ల కు అందరు సమానంగా అనిపించే నాయకుడికి గెలిచిన తరువాత వాడు మనోడు కాదనే అహంకారం రావడం కోతేమి కాదు.ఓట్లు ఎవరు చూడకూడదని ఒక్కొక్కరిని పంపించిన ఎవరు ఎవరికీ ఓటేసారో లెక్కలతో చెప్పడం కంప్యూటర్ తరం కూడా కాదు,కానీ కొందరికి ఆ శక్తి వరం ల వస్తుందంట. అందుకని ఓ కష్టపడ్డాక పార్టీ కార్యకర్తలారా తిరిగి మీ మీ జీవన శైలిలో లివర్ణం కావాలన్నదే దీని అర్థం.

## పోచారం భాస్కర్ రెడ్డి కలసిన బోర్లం గ్రామ బి ఆర్ ఎస్ కార్యకర్తలు..

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:



బాన్సువాడ గ్రామీణ మండలం బోర్లం గ్రామ బి ఆర్ ఎస్ నాయకులు కార్యాకర్తలు బోర్లం గ్రామంలో ఎంపీ ఎన్నికలలో గ్రామంలో 2బూతులలో ని పరిస్థిని డీసీసీబీ మాజీ చైర్మన్ బి ఆర్ ఎస్ నియోజకవర్గం ఇంచార్జ్ పోచారం భాస్కర్ రెడ్డి కి మంగళవారం కలసి వివరించడం జరిగింది.ఎంపీ ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన బోర్లం గ్రామ నాయకులకు ధన్యవాదములు తెలిపిన పోచారం భాస్కర్ రెడ్డి. ఈ కార్యక్రమం లో బోర్లం గ్రామ బి ఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు ,పాల్గొన్నారు.

## పోచారంపై అభిమానంతో మామిడి పండ్లను అందించిన మహిళ..

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:



బాన్సువాడ పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద కు విచ్చేసిన మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డికి మామిడిపళ్ళు అమ్ముకునే మహిళ చూసి ఆనందంతో మామిడి పండ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గూడు లేని నిరుపేదలకు ఉచితంగా ఇళ్లను అందించిన దేవుడు పోచారం శ్రీనివాస్ రెడ్డి అని తెలిపారు. బాన్సువాడ నియోజకవర్గ ప్రజలందరికీ తమ కుటుంబ సభ్యులుగా భావించే గొప్ప మనసున్న మహా వ్యక్తి పోచారం అని కితాబు ఇచ్చారు. ఆయన సద ఎల్లకాలం సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. అయన వెంట బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ తో పాటు తదితర భార స నాయకులు, కార్యకర్తలు, ఉన్నారు.

## బాన్సువాడ నియోజకవర్గంలో 76.98 శాతం పోలింగ్ నమోదు...

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని బాన్సువాడ అసెంబ్లీలో 76.98% పోలింగ్ నమోదు అయినట్లు మంగళవారం ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రమేష్ రాథోడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్ కు తరలించినట్లు ఆయన తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సంపూర్ణ స్థాయిలో సహకరించిన ఆయా రాజకీయ పార్టీల నాయకులకు, అధికారులకు, ప్రజలకు, ప్రతి ఒక్కరికి పేరుపేరునా అభినందనలు, కృతజ్ఞతలు, ధన్యవాదాలు, తెలియజేశారు.



# నిజామాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ లో 71.92 శాతం పోలింగ్ నమోదు

**మొత్తం 17,04,867 ఓటర్లలో ఓటును వినియోగించుకున్న వారు 12,26,133 మంది**

**6,73,629 మంది మహిళా ఓటర్లు, 5,52,465 మంది పురుషులు**

**ఇతరులలో 39 మంది ఓటర్లు**

**రిటర్నింగ్ ఆఫీసర్, జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు**

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ కలెక్టరేట్



నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో సగటున 71.92 శాతం పోలింగ్ నమోదయ్యిందని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. మొత్తం 1704867 మంది ఓటర్లకు గాను 1226133 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని వెల్లడించారు. ఓటింగ్ లో పాల్గొన్న వారిలో మహిళా ఓటర్ల సంఖ్య 673629 ఉండగా, పురుష ఓటర్లు 552465 మంది, ఇతరులు 39 మంది ఓటు వేశారని అన్నారు. పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలోని ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పోలైన ఓటింగ్ ను పరిశీలిస్తే, ఆర్మూర్ నియోజకవర్గంలో మొత్తం 212145 మంది ఓటర్లకు గాను 155159 ఓటర్లు (73.14 శాతం) ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. బోధన్ నియోజకవర్గంలో 223096 మంది ఓటర్లకు గాను 166330 ఓటర్లు (74.56 శాతం), నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో 304317 మంది ఓటర్లకు గాను 188159 ఓటర్లు (61.83 శాతం), నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో 256593 మంది ఓటర్లకు గాను 191252 ఓటర్లు (74.54 శాతం), బాల్కొండ నియోజకవర్గంలో 226792 మంది ఓటర్లకు గాను 169524 ఓటర్లు (74.75 శాతం), కోరుట్ల నియోజకవర్గం పరిధిలో 245249 మంది ఓటర్లకు గాను 180867 ఓటర్లు (73.75 శాతం), జగిత్యాల నియోజకవర్గంలో 236675 మంది ఓటర్లకు గాను 174842 ఓటర్లు (73 .87 శాతం) తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని కలెక్టర్ వివరించారు.

## కోట దుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న ప్రసాదం వితరణ...

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:



బాన్సువాడ మున్సిపల్ కేంద్రంలోని కోట గల్లీలో నూతనంగా నిర్మించిన కోట దుర్గమ్మ ఆలయం ప్రాంగణంలో మంగళవారం భక్తులకు అన్న ప్రసాదం వితరణ చేపట్టారు. అన్న ప్రసాదం సమర్పకులు సామెత తరంగిణి భీమ్రాజ్ రైటర్ వారి ఆర్థిక సౌజన్యంతో భక్తులకు అన్న ప్రసాదం వితరణ చేపట్టారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. సామూహిక కుంకుమార్చన ,లలిత సహస్ర నామ పారాయణం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కోట దుర్గమ్మ ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు పత్తి శ్రీకాంత్, తో పాటు కాలనీ మహిళలు, భక్తులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, తదితరులు, పాల్గొన్నారు.

## అనారోగ్యానికి గురైన కార్యకర్తకు అండగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే ,ఏనుగు రవీందర్ రెడ్డి

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:



బాన్సువాడ పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త శాంద్ మంగళవారం అనారోగ్యానికి గురై స్థానిక సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గం ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి తన అనుచరులతో కలిసి సెవెన్ హిల్స్ ఆసుపత్రికి చేరుకొని, శాంద్ ని పరామర్శించి, వైద్యులతో మాట్లాడి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగవ వైద్య చికిత్సలు అందించాలని ఆసుపత్రి సిబ్బందిని సూచించారు. వైద్యాన్ని ఖర్చులు తానే భరిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఆపద సమయంలో కార్యకర్తకు అండగా ఉండి, కొండంత ధైర్యం ఇచ్చిన ఏనుగు రవీందర్ రెడ్డి తీరు పట్ల పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, హర్షం వ్యక్తం చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ప్రతాప్ సింగ్, నార్ల రత్నకుమార్ గుప్తా, పాత బాలకృష్ణ గుప్తా, అలీబిన్ అబ్దుల్లా, అఫ్రోజ్, గాదె సత్యం, తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉన్నారు.

## నీటి ఎద్దడి నివారణకు చర్యలు




టైమ్స్ ఆఫ్ వార్త-బిక్కనూర్

నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కాంగ్రెస్ ప్రణాళిక కమిటీ అధ్యక్షులు దశరథం తెలిపారు. మంగళవారంమండలంలోని కాచాపూర్ గ్రామంలో నీటి ఎద్దడి ఉండడంతో బోరు తవ్వకాలు ప్రారంభించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుదర్శన్, గ్రామ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మండల ప్రజలకు కృతజ్ఞతలు ఎమ్మార్వో

టైమ్స్ ఆఫ్ వార్త-భిక్కనూర్



పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మండలంలో ఓటింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించిన అధికారులకు, ఇబ్బందికి ఓటు హక్కు వినియోగించుకున్న ప్రజలకు ఎమ్మార్వో శివప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలో 79 శాతం ఓటింగ్ నమోదు అయినట్టు తెలిపారు.

## ఎస్సై ని కలిసిన కాంగ్రెస్ నాయకులు




టైమ్స్ ఆఫ్ వార్త-భిక్కనూర్

మండలంలోని బాగిర్తిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఎస్సై సాయి కుమార్ ను కలిశారు. .పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ పోలీసులు అందించిన సహకారం ఎంతో గొప్పదని కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ సొసైటీ అధ్యక్షులు సంతోష్ కుమార్ అన్నారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు తగు చర్యలు తీసుకోవడం ఎంతో అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో గ్రామకాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

జనరల్ న్యూస్
GENERAL NEWS
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దినపత్రిక
బుధవారం,
15-05-2024
4

# ఉమ్మడి రాష్ట్రానికి నిజామాబాద్ దిక్సూచి

**నిజామాబాద్ ప్రజలు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నారు**

**లక్ష ఓట్లకు పైగా మెజారిటీతో గెలుస్తాం**

**పార్లమెంటులో తలెత్తిన అంశాలను సమకూర్చడమే లక్ష్యం**

**ఓటింగ్ శాతం పెంచిన ప్రజలందరికీ ధన్యవాదాలు**

**కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డి**



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ జిల్లా ప్రతినిధి

పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతమైన వాతావరణంలో శాంతియుతంగా పోలింగ్ సహకరించిన నిజామాబాద్ ప్రజలు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు. ఈనెల 13న జరిగిన ఎన్నికలు సజావుగా జరిగిన సందర్భంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏది ఏమైనప్పటికీ మతసామరస్యానికి నిజామాబాద్ ప్రజలు ప్రతీకగా నిలుస్తున్నారని చెప్పడంలో అతిశయోక్తి లేదన్నారు. ఎన్నో రెచ్చగొట్టే ప్రయత్నాలు ఎన్ని ఉన్నా వాటిని ప్రభావితం చేయకుండా సామరస్యంగా, శాంతియుతంగా సహకరించడం అభినందనీయమన్నారు. అయితే పార్టీ అధిష్టానం తనకు ఇచ్చిన అవకాశానికి పార్టీలోని కింది స్థాయి కార్యకర్తలు నుంచి ఉన్నత స్థాయి వరకు ఉన్న నాయకులంతా ఎవరికి వారే అభ్యర్థిగా భావించి అత్యధిక ఓట్లు పోలింగ్ అయ్యేవిధంగా కృషి చేసిన అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ పరిణామం సమిష్టి కృషి అని చెప్పక తప్పదు అన్నారు. ఇదిలా ఉండగా ప్రతిపక్ష పార్టీలైన బిజెపి, బిఆర్ఎస్ రెండు కలిసి కాంగ్రెస్ పార్టీనీ నిలువరింపజేసే భావనతో ఉన్నారన్నారు. గత ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి పార్టీ చతికిలబడిన విషయం తెలిసిందేనని ఈ ఎన్నికల్లో ఉనికిని కాపాడుకునేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తుందన్నారు. ఈ ఎన్నికల్లో ఎలాగు గెలవలేమని తెలిసి కాంగ్రెస్ పార్టీకి ఆటంకాలు సృష్టించే విధంగా భారతీయ జనతా పార్టీ ఒక మతతత్వ పార్టీ అని తెలిసి కూడా వారికి మద్దతు తెలిపే ప్రయత్నాలు చేయడం దురదృష్టకరమన్నారు. బిజెపి రాజకీయ లబ్ధి కోసం చేస్తుందని, ఆర్థిక అభివృద్ధి ఏంటో ప్రణాళిక లేకుండా కేవలం మత విద్వేషాలు సృష్టించి రాజకీయ లబ్ధి కోసం గెలుపు పోరాటం చేస్తుందని ఆరోపించారు. ఈ విషయాన్ని యావత్ రాష్ట్ర ప్రజలు గ్రహించారని గుర్తు చేశారు. ఎటువంటి అభ్యంతరాలు లేకుండా హింసాయుతంగా శాంతియూత పోలింగ్ కోసం నిజామాబాద్ ప్రజలు ప్రత్యేకగా నిలవడానికి ఓటింగ్ సరళిలో పాల్గొనడం దానికి సంకేతం అన్నారు. గతంలో ఉన్న ప్రభుత్వాలు ఈ ప్రాంత ప్రజలను, ఈ ప్రాంత అభివృద్ధికి కొంత నిర్లక్ష్యం చేశారన్నారు. షుగర్ ఫ్యాక్టరీని మూసేయడం, మూయబడిన ఫ్యాక్టరీని పునః ప్రారంభించకపోవడం వంటి అంశాలు ప్రభావితం చేస్తున్నాయన్నారు. తాను నామినేషన్ వేస్తున్న ప్రక్రియ లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రాంతంపై ప్రత్యేక శ్రద్ధ చూపించారని, బోధన్ ప్రాంతంలో సుదర్శన్ రెడ్డి ప్రాతినిధ్యం వహించడం షుగర్ ఫ్యాక్టరీ ఆ పరిధిలో ఉండటం, అదేవిధంగా జగిత్యాలలో షుగర్ ఫ్యాక్టరీ ఉండడం వీటిని దృష్టిలో ఉంచుకొని 2025లో ఫ్యాక్టరీల పునః ప్రారంభం కోసం రాష్ట్ర పరిధిలోని అంశంగా భావిస్తున్నామన్నారు. అయితే నిజామాబాద్ కు వైశాల్యం, ఆర్థిక వనరులు వంటి ఎన్నో పారామీటర్స్ ఉన్నప్పటికీ స్మార్ట్ సిటీగా ఎంపిక చేయడం దురదృష్టకరమన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహిఇస్తున్నార న్నారు. ఈ ప్రాంతంలో విద్యా సదుపాయాలలోని ఇంజనీరింగ్ కాలేజ్, ఉమెన్స్ కాలేజ్ వీటన్నిటిని సాధించే విషయంలో నిర్లక్ష్యానికి గురైందన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికలు ఆశించిన ఫలితం పొందడం ఒక అంశమని ఖచ్చితంగా లక్షకు పైగా మెజారిటీతో గెలవబోతున్నామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అదేవిధంగా ఉమ్మడి రాష్ట్రానికి నిజామాబాద్ ఒక దిక్సూచిగా ఉందని, నిజామాబాద్ జిల్లాలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, గోదావరి, ప్రాణహిత చేవెళ్ల, 21 ప్యాకేజ్ వంటి ఇవన్నీ కలిగి ఉండటంతో నిజామాబాద్ దిక్సూచిగా నిలుస్తుంది అన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నిక మరింత బాధ్యత పెంచిందని సమష్టి నాయకత్వంలో అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అభ్యర్థి ఎవరైనప్పటికి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకునే విధంగా పనిచేసిన ప్రతి ఒక్కరిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే ప్రొద్దుటూరు సుదర్శన్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, డిసిసి, మినరల్ డెవలప్మెంట్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహేర్ బిన్ హమ్దాన్, కాంగ్రెస్ పార్టీ బాల్కొండ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డి, డిసిసిబి చైర్మన్ రమేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు ఆకుల లలిత, అరికల నర్సారెడ్డి, డి. రాజేశ్వరరావు, నగేష్ రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, శేఖర్ గౌడ్, ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షుడు బట్టు వేణు రాజ్, విపుల్ గౌడ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే పదేళ్లూ రాష్ట్ర పాలనలోనే ఉంటా



(మొదటి పేజీ తరువాయి)..

ఫోన్ ట్యాపింగ్ సంబంధిత అంశాలను అసెంబ్లీకే చెబుతామన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే వర్సిటీలకు కొత్త వీసీలను నియమిస్తామని చెప్పారు. కరెంటు విషయంలో హరీశ్‌రావు ఒక మెకానిజం ఏర్పాటు చేసి.. ఎన్నికల్లో ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలని చూశారని ఆరోపించారు. ఇందుకు సంబంధించి కొన్ని కేసులను గుర్తించి నమోదు చేశామన్నారు.

## పదేళ్లు రాష్ట్రంలోనే..

రానున్న పదేళ్లూ తాను తెలంగాణ రాజకీయాల్లోనే ఉంటానని సీఎం రేవంత్ అన్నారు. రానున్న వందేళ్ల అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసి ప్రజలకు అందించడం తన బాధ్యత అని పేర్కొన్నారు. ఏపీలో ఎవరు ముఖ్యమంత్రి అయినా వారితో సత్సంబంధాలు పెట్టుకుంటామని, రెండు రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరించుకుంటామని స్పష్టం చేశారు. ఇక మూసీ నదిని రాష్ట్రానికి ఆదాయాన్నందించే వనరుగా మారుస్తామని, కన్సల్టెన్సీ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కేసీఆర్ మాదిరిగా తాను మేధావిని కాకపోవడం వల్లనే కన్సల్టెన్సీ నివేదికలపై ఆధారపడుతున్నానని రేవంత్ ఎద్దేవా చేశారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం వల్ల మెట్రోను అమ్ముకునే పరిస్థితి వస్తుందన్న యాజమాన్యం వ్యాఖ్యలపై సీఎం స్పందిస్తూ, "వాళ్ల ఆస్తిని వాళ్లు అమ్ముకుంటానంటే ఎవరు వద్దన్నారు?" అని ప్రశ్నించారు. హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతం చేస్తారని ఎవరైనా అంటే అంత తెలివిలేనివాడు ఇంకొకడు ఉండడన్నారు. యూటీ అనేది స్టాప్ గ్యాప్ మాత్రమేనని, అది విఫల ప్రయోగం అని కూడా అన్నారు. నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు.

## ఆరేడు సీట్లలో బీఆర్ఎసకు డిపాజిట్ రాదు..

రాష్ట్రంలోని 17 లోక్‌సభ సీట్లకుగాను ఆరేడు సీట్లలో బీఆర్ఎసకు డిపాజిట్ కూడా రాదని సీఎం రేవంత్ అన్నారు. మెదక్‌లో మాత్రమే ఆ పార్టీ గట్టి పోటీ ఇచ్చే అవకాశం ఉందన్నారు. కాంగ్రెసకు 13 సీట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీని తమకు ప్రత్యర్థిగా బీఆర్ఎస్ బలవంతంగా సృష్టించిందని ఆరోపించారు. దేశంలో, రాష్ట్రంలోనూ మోదీ వేవ్ లేదని, బీఆర్ఎస్ ఆ పార్టీ యంత్రాంగం మొత్తాన్ని బీజేపీకి అప్పగించిందని అన్నారు. రాజకీయాల్లో హత్యలు ఉండవని, ఆత్మహత్యలే ఉంటాయని వ్యాఖ్యానించారు. దేశ వ్యాప్తంగా ఎన్డీయేకు పది శాతం అటు ఇటుగా 220 సీట్లు వస్తాయని తెలిపారు. కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికలో తమ అభ్యర్థి 20 వేల మెజారిటీతో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. అక్కడ మాత్రం బీఆర్ఎస్ పోటీ ఇస్తుందని అన్నారు. రాష్ట్ర ఆర్థికస్థితిపై శ్వేతపత్రాన్ని ప్రకటించడాన్ని కేసీఆర్ తప్పుబట్టడంపై స్పందిస్తూ ఆయన చేసిన పాపాలన్నింటినీ మూసిపెట్టాలనుకుంటున్నారా? అని ప్రశ్నించారు.

# షబ్బీర్ అలీని కలిసిన కాంగ్రెస్ నాయకులు

టైమ్స్ ఆఫ్ వార్త-భిక్కనూర్



బిక్కనూరు మండలంలోని కాచాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని కలిశా రు. పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో మాజీ ఎంపీపీ సుదర్శన్ ఆధ్వర్యంలో నాయకులు ఆయన్ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎన్ ఎస్ యు ఐ మండల అధ్యక్షుడు అశోక్, మాజీ సర్పంచ్ భూపతి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


# తుంగతుర్తి వైన్స్ షాపులలో కొత్త దందా

**నైట్ ఎనిమిది గంటలకు ముందు స్టాక్ దిగితే రాత్రికి రాత్రి మాయం**

**ఎక్కువ ధరకు బీర్ల కాటన్లు పక్కదారి మళ్లింపు**

**అన్ని తెలిసినా పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు**

టైమ్స్ ఆఫ్ వార్త - సూర్యాపేట జిల్లా ప్రతినిధి




తుంగతుర్తి మండల కేంద్రంలో మూడు వైన్ షాపులలో దొరకని బీర్లు బెల్ట్ షాపులలో ఎక్కడ అడిగినా విచ్చలవిడిగా దొరుకుతాయి వివరాలలోకి వెళితే వైన్ షాపులో కూలింగ్ పెట్టి 150 రూపాయలకు అమ్మితే లాభం లేదని వైన్స్ యజమానులు అందరూ కుమ్మక్కై ఎక్కువ ధరకు బెల్ట్ షాపులకు అమ్ముకొని బీర్లకు వచ్చిన కస్టమర్లకు బీర్లు లేవని అయిపోయినవని స్టాక్ రావట్లేదని లేదని మాయ మాటలు చెప్పి కొత్త దందా ప్రారంభించారు. బెల్ట్ షాపులో వారు 200 నుంచి 220 రూపాయలకు అమ్ముకుంటున్నారు, అలా ఎక్కువ దరకు మేము కొనడం వల్ల చాలా నష్టపోతున్నామని కొంతమంది యువకులు వాపోతున్నారు,నల్గొండ నుంచి వైన్స్ కు వచ్చిన స్టాక్ లారీ దిగుమతి అయిన రాత్రికి రాత్రి పక్కదారి పట్టించి బెల్ట్ షాపులకు ఇన్ఫర్మేషన్ ఇచ్చి వారికి ఎక్కువ దొరకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు అని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు, బెల్ట్ షాప్ లో వారికి అయితే కూల్ పెట్టకుండా ఇవ్వవచ్చు ఎక్కువ దరకు అమ్ముకోవచ్చు అదే కస్టమర్లకు అమ్మితే ఎమ్మార్పీ ధరకే అమ్మాలి కూల్ పెట్టాలి కాబట్టి బీర్ కాటన్లను పక్కదారి మళ్లిస్తున్నారు. అని తుంగతుర్తి మండల కేంద్రంలో కొంతమంది యువకులు వైన్స్ సిబ్బందిని నిలదీశారు , తుంగతుర్తి మండలానికి చెందిన పలువురు యువకులు చాలాసేపు షాపు ముందు లొల్లి చేశారు మాకు బెల్ట్ షాపులలో కూడా ఎమ్మార్పీ రేటుకే బీర్లను ఇవ్వాలని పలువురు యువకులు, గగ్గోలు పెడుతున్నారు కావున తక్షణమే ఆప్కారి అధికారులు స్పందించి తుంగతుర్తి మండల ప్రజలకు యువకులకు బీర్లు వైన్ షాపులో లభించే విధంగా చర్యలు చేపట్టాలని పలు గ్రామాల యువకులు కోరుతున్నారు.

# బోధన్ నియోజకవర్గంలో 74.56శాతం ఓటింగ్ నమోదు..

టైమ్స్ ఆఫ్ వార్త-బోధన్



పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సోమవారం జరిగిన ఎన్నికల్లో 74.56శాతం ఓటింగ్ నమోదు అయినట్లు జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు మంగళవారం వెల్లడించారు. పురుషులు 1,06, 372 ఓటర్లు ఉండగా 78,736 ఓటర్లు, మహిళలు 1,16,719 ఓటర్లకు 87,494 ఓటు వేశారు. బోధన్ నియోజకవర్గంలో మొత్తం 2,23,096ఓటర్లకు గాను1,66,330 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు కలెక్టర్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

# మోడీని కోరుకునే దేశ ప్రజల భవిష్యత్తు కోసమే ఈ ఎన్నికలు

**50 శాతానికి పైగా భారతీయ జనతా పార్టీకి ఓటింగ్**

**కచ్చితంగా అరవింద్ రెండోసారి ఎంపీగా గెలవడం ఖాయం**

**అదే శుభవార్తతో వచ్చే నెల 4న మీ ముందుకు వస్తాం**

**ఎన్నికల ప్రశాంతంగా జరిగేందుకు పర్యవేక్షించిన అధికార యంత్రాంగానికి కృతజ్ఞతలు**

**భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి**




టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

దేశ ప్రధానిగా నరేంద్ర మోడీ ఉండాలని, దేశ భవిష్యత్తును కోసం ప్రజలు కోరుకుంటున్నారని, ఆ దిశగానే ఈ పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్నాయని భారతీయ జనతా పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు కులచారి దినేష్ అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండుటెండను సైతం లెక్కచేయకుండా ఓట్లు వేసేందుకు ప్రజలు ముందుకు రావడం అభినందనీయం అన్నారు. ప్రజల్లో ఉన్న ఆసక్తిని చూస్తుంటే మోడీ నాయకత్వాన్ని మరోసారి బలపరుస్తున్నారు అనే సంకేతాలు కనిపిస్తున్నాయన్నారు. ఓటు వేసి భారతీయ జనతా పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న ఓటర్లందరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గ పరిధిలో ఎక్కడ కూడా గొడవలు లేకుండా తగిన పర్యవేక్షణ చర్యలు తీసుకున్న అధికార యంత్రాంగానికి, పోలీసు యంత్రాంగానికి, ఎలక్షన్ కమిషన్ కు ఇందూరు బిజెపి పక్షాన ధన్యవాదాలు తెలిపారు. అయితే దేశ భవిష్యత్తు కోసమే ఈ ఎన్నికలు అనే విధంగా ప్రజలు ఓటు వేయడం విశేషం అన్నారు. దీంతో వచ్చే నెల 4న జరిగే ఫలితాల్లో 50 శాతానికి పైగా ఓటింగ్ పొంది మంచి మెజారిటీతో బిజెపి అభ్యర్థి ధర్మపురి అరవింద్ రెండవసారి గెలవబోతున్నారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. దేశానికి సైనికుడు, ఇంటికి యజమాని, పంటకు రైతు ఏ విధంగా అవసరమో దేశ ప్రజల రక్షణ కోసం భద్రత కోసం నరేంద్ర మోడీ అవసరమని ప్రజలు తీర్పునిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో మోడీని బలపరిచిన అందరికీ, బిజెపి కి ఓటు వేసి మద్దతు తెలిపినందుకు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా గత డిసెంబర్ లో జరిగిన ఎన్నికల కంటే అధిక శాతం పోలింగ్ నమోదు కావడం శుభపరిణామన్నారు. దీంతో ప్రజలకు పార్టీల మీద, నాయకుల మీద విశ్వాసం పెరిగిందన్నారు. పలు ప్రాంతాల్లో కొన్ని చిన్న చిన్న కారణాలు తప్ప అవి లేనిపక్షంలో 80 శాతానికి పైగా పోలింగ్ జరిగేదన్నారు. ఇదిలా ఉండగా ఓటింగ్ శాతం పెరగడంలో నిరంతరం పార్టీ కోసం శ్రమించిన కార్యకర్తల కష్టం చాలా ఉందన్నారు. ఇకపోతే గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో వారితో పోరాటాలు జరిగిన సందర్భాన్ని గుర్తు చేస్తూ రాజకీయంగానే కాకుండా వ్యక్తిగతంగా, ఆర్థికంగా, సామాజికంగా అన్ని విధాలుగా బిజెపి కార్యకర్తలు పోరాడి అణగదొక్కబడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ప్రభుత్వం అందిస్తున్న ఎన్నో విధాల సంక్షేమ పథకాలకు సైతం బిజెపి కార్యకర్తలు దూరమయ్యారన్నారు. దీని ప్రభావం కార్యకర్తలపై అట్రాసిటీ కేసులు నమోదు చేసి కిందిస్థాయిలో ఉన్న శ్రామిక కార్యకర్తలు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ఎప్పటికైనా నమ్మిన సిద్ధాంతం ప్రకారం కార్యకర్తలు వారి కష్టానికి తగిన ఫలితం ఈ ఎన్నికల్లో తప్పకుండా లభిస్తుందన్నారు. గత ఎన్నికల్లో మెజారిటీ సాధించలేకపోయినప్పటికీ రెండు శాసనసభ నియోజకవర్గాల్లో భారతీయ జనతా పార్టీ స్థానాలు సాధించామన్నారు. రెండు చోట్ల ద్వితీయ స్థానంలో ఉండగా పలుచోట్ల గట్టి పోటీ ఇచ్చినామని తెలిపారు. ఇక తాజాగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 50 శాతానికి పైగా భారతీయ జనతా పార్టీ వైపు పోలింగ్ జరిగిందని విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ ధర్మపురి అరవింద్ రెండవసారి ఎంపిగా గెలిచి తీరుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మంచి పాలనను ఆదరిస్తున్నారని ప్రజల్లో విశ్వాసం పెరిగిందని తెలిపారు. భారతీయ జనతా పార్టీ సిద్ధాంతం లోని సబ్కే సాత్..సబ్కా వికాస్.. సబ్కా విశ్వాస్ అనే నినాదంతో పనిచేస్తున్న విధంగా సత్ఫలితాలు పొందుతున్నామని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి న్యాలం రాజు, పి. లక్ష్మీనారాయణ, నారాయణ యాదవ్, కిషన్, పద్మారెడ్డి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయం, సమిష్టి కృషితో ఎన్నికలు విజయవంతం

**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ హర్షం**




టైమ్స్ ఆఫ్ వార్త - మెదక్ జిల్లా ప్రతినిధి

పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగియడం పట్ల జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ హర్షం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన మార్చి 16 నుండి మే 13వ తేదీ వరకు ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల నిర్వహణలో జిల్లా ప్రజల సహాయ, సహకారాలు భాగస్వామ్యం మరువలేని దని ఆయన పేర్కొన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా, నిష్పక్ష పాతంగా నిర్వహించడంలో సహకరిం చిన ప్రతి ఒక్కరిని ఆయన అభినందించారు. మన జిల్లాలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడం చాలా సంతోషమని అన్నారు. పోలింగ్ సమయం ఉదయం 7 నుండి సాయంత్రం 06 ఎన్నికల క గంటల వరకే అయినప్పటికీ ఓటర్లు పెద్ద ఎత్తున ఎండలను సైతం లెక్కచేయక ఓటు హక్కు వినియోగించుకోవడంలో చైతన్యం చాటారని, అందువల్ల గత పార్లమెంటు ఎన్నికల కంటే దాదాపు 04% శాతం అధికంగా పోలింగ్ నమోదు జరిగిందని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగస్వాములైన అధికారులను, అనధికారులను, జిల్లా ప్రజలను, పాత్రికేయులను జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అభినందించారు.

జనరల్ న్యూస్
GENERAL NEWS
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దినపత్రిక
బుధవారం,
15-05-2024


# పుష్ప-2 షూట్‌లో బిజీగా అల్లు అర్జున్

### తదుపరి చిత్రంపై ఇప్పటి నుంచే ప్లాన్




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రస్తుతం 'పుష్ప-2' చిత్రంతో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం రామోజీ ఫిల్మ్‌సిటీలో చిత్రీకరణ జరుగుతోంది. జాతర నేపథ్యంలో సాగే పాటను చిత్రీకరిస్తున్నారు. అల్లు అర్జున్, రష్మిక మందన్నాపై ఈ పాటను చిత్రీకరిస్తున్నారు. వచ్చే ఏడాది ఆగస్టు 15న విడుదల చేసేలా షూటింగ్ పార్ట్ పూర్తి చేస్తున్నారు. పుష్ప-2 తర్వాత బన్నీ చేయబోయే చిత్రం గురించి ఓ ఆసక్తికర వార్త నెట్టింట వైరల్ అవుతోంది. జవాన్ తో సూపర్‌హిట్ అందుకున్న యంగ్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో అల్లు అర్జున్ నెక్ట్స్ ప్రాజెక్ట్ ఉంటుందని వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. పక్కా కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం ఉండబోతోందట. ఇందులో బన్నీ ఓ కొత్త లుక్‌లో కనిపించనున్నారని సమాచారం. వచ్చే ఏడాదిలో ఈ చిత్రం ప్రారంభించాలని అట్లీ అనుకుంటున్నారట. ప్రస్తుతం దీనిపై చర్చలు జరుగుతున్నాయనీ.. త్వరలోనే దీనికి సంబంధిత వార్తలు వెల్లడించనున్నారని టాక్ వినిపిస్తోంది. 'పుష్ప 2' షూటింగ్ పూర్తి కాగానే అట్లీ ప్రాజెక్ట్‌పై బన్నీ పూర్తి దృష్టి పెట్టనున్నట్లు సమాచారం. 'జవాన్' విజయం సాధించిన సందర్భంగా అల్లు అర్జున్ జవాన్ టీమ్‌ను అభినందిస్తూ ట్వీట్ చేశారు. ఆ పోస్ట్‌కు అట్లీని, మ్యూజిక్ దర్శకుడు అనిరుద్ధ్‌ను ట్యాగ్ చేసి 'నా సినిమాకు కూడా ఇలానే మ్యూజిక్ అందించాలని పేర్కొన్నారు.

# 'వేట్టయాన్' షూటింగ్ పూర్తి చేసిన రజినీకాంత్

సూపర్ స్టార్ రజినీకాంత్ టైటిల్ పాత్రలో జై భీమ్ ఫేమ్ టీ.జే. జ్ఞానవేల్ దర్శకత్వంలో 'వేట్టయాన్' అనే చిత్రం రూపొందుతోంది. పాన్ ఇండియన్ రేంజ్‌లో ఎన్నో ప్రముఖ చిత్రాలను నిర్మిస్తున్న లైకా ప్రొడక్షన్స్ బ్యానర్ మీద సుభాస్కరన్ భారీ ఎత్తున ఈ మూవీని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, ఫహద్ ఫాసిల్, రానా దగ్గుబాటి, మంజు వారియర్ వంటి భారీ తారాగణం నటిస్తోంది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన అప్‌డేట్ వచ్చింది. రజినీకాంత్ ఈ మూవీ షూటింగ్‌ను పూర్తి చేసుకున్నారు.

తన పాత్రకు సంబంధించిన షూట్‌ను పూర్తి చేయడంతో చిత్రయూనిట్ ఘనంగా వీడ్కోలు పలికింది. ఈ మేరకు నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ సోషల్ మీడియాలో ట్వీట్ వేస్తూ ఈ విషయాన్ని ప్రకటించింది. యూనిట్ సభ్యులు అంతా కలిసి రజినీకాంత్‌కి గ్రాండ్‌గా వీడ్కోలు పలికారు. ఇప్పటికే ఈ సినిమా మీద అంచనాలు భారీ స్థాయిలో నెలకొన్నాయన్న సంగతి తెలిసిందే. వేట్టయాన్ మూవీని ఈ ఏడాది అక్టోబర్‌లో విడుదల చేయబోతోన్నట్టుగా ప్రకటించారు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతాన్ని అందిస్తున్నారు.



## ఈగల్ బ్లాక్‌బస్టర్ ఖాయం




రవితేజ సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ హిట్ 'ధమాకా'. శ్రీలీల హీరోయిన్‌గా త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించిన ఈ చిత్రం ఏడాది పూర్తి చేసుకుంది. మరోవైపు ఇదే బ్యానర్‌లో రవితేజ తాజాగా నటించిన చిత్రం 'ఈగల్'. సంక్రాంతి కానుకగా జనవరి 13న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా 'ఈగల్ అండ్ ధమాకా' సెలబ్రేషన్స్‌ని గ్రాండ్‌గా నిర్వహించారు మేకర్స్. ఈ వేడుకలో 'ధమాకా' టీమ్‌కు మెమెంటోలు అందజేశారు. రవితేజ మాట్లాడుతూ,'నిర్మాత విశ్వప్రసాద్‌కి అభినం దనలు. 'ధమాకా' నిన్నో మొన్నో విడుదలైనట్లుంది. సంగీత దర్శకుడు భీమ్స్ ఇచ్చిన పాటలకు.. తనకి మంచి గుర్తింపు వస్తుందని సినిమా విడుదలకాక ముందే బలంగా నమ్మాను. అదే నిజమైంది. శ్రీలీల పెద్ద హీరోయిన్ అవు తుందని చెప్పాను. ఊహించినట్లే శ్రీలీల హీరోయిన్‌గా అద్భుతంగా రాణిస్తోంది. ఇక 'ఈగల్' సినిమా విషయానికి వస్తే,.. కార్తిక్‌ని కెమెరా మ్యాన్‌గా చూశాం. ఇప్పుడు దర్శకుడిగా చూడబో తున్నాం. ఒక్కటి మాత్రం చెప్పగలను.. ఇందులో ప్రేక్షకులకు ఒక కొత్త రవితేజను చూపించబోతున్నాడు. అలాగే ఈ సినిమాలో కొత్త కావ్యా థాపర్ కనిపిస్తుంది. ఆ పాత్ర నాకు చాలా నచ్చింది. దేవ్ జాంద్ చాలా మంచి మ్యూజిక్ ఇచ్చాడు' అని అన్నారు. 'ఏడాది రెండు వైవిధ్యమైన చిత్రాలు చేశాను. ఒకటి ధమాకా.. రెండు ఈగల్. ఇద్దరు భిన్నమైన నటులతో పని చేసినట్లుగా అనిపిస్తోంది. ఈగల్ అన్ని కమర్షియల్ అంశాలు ఉన్న చాలా మంచి చిత్రం' అని దర్శకుడు కార్తిక్ ఘట్టమనేని చెప్పారు. నిర్మాత టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ,'గత ఏడాదిని బ్లాక్‌బస్టర్‌తో ఎండ్ చేశాం. నెక్ట్స్ ఇయర్ బ్లాక్ బస్టర్‌తో మొదలుపెడతాం. ఈగల్ మంచి ఎంటర్ టైనర్. రవితేజ బిగ్ మాస్ అవతార్‌తో చాలా అద్భుతమైన యాక్షన్ ఉంటుంది. ఖచ్చితంగా పెద్ద విజయాన్ని సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని తెలిపారు.

## అంబాజీపేట మ్యారేజి బ్యాండు




కలర్‌ఫొటో ఫేం సుహాస్ కాంపౌండ్ నుంచి వస్తున్న చిత్రాల్లో ఒకటి అంబాజీపేట మ్యారేజి బ్యాండు. దుశ్యంత్ కటికినేని దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రంలో శివానీ నగరం హీరోయిన్‌గా నటిస్తోంది. మేకర్స్ ఇప్పటికే విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్ సినిమాపై అంచనాలు అమాంతం పెంచుతున్నాయి. ఈ చిత్రం నుంచి రిలీజ్ చేసిన గుమ్మా సాంగ్ కూడా నెట్టింట వైరల్ అవుతోంది. కాగా ఈ సినిమా రిలీజ్ అప్‌డేట్‌పై క్లారిటీ ఇచ్చేసింది సుహాస్ టీం. మూవీని వచ్చే ఫిబ్రవరి 2న విడుదల చేస్తున్నట్టు తెలియజేస్తూ కొత్త పోస్టర్‌ను షేర్ చేశారు. ఈ లుక్ నెట్టింట వైరల్ అవుతోంది. హీరోహీరోయిన్ల మధ్య సరదా లవ్ ట్రాక్‌తో సాగుతున్న గుమ్మా సాంగ్ మ్యూజిక్ లవర్స్ ను ఇంప్రెస్ చేస్తుండగా.. మేకింగ్ వీడియో సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. సుహాస్ టీజర్‌లో ఓ వైపు హెయిర్ సెలూన్ నడిపిస్తూ.. మరోవైపు మ్యారేజి బ్యాండు టీంలో కలిసి పనిచేస్తూ.. శివానీతో లవ్‌లో పడే యువకుడిగా ఫన్, సీరియస్‌గా ఎంటర్‌టైన్ చేయనున్నట్టు తెలియజేశాడు డైరెక్టర్. హీరోహీరోయిన్ల ఫన్నీ లవ్ ట్రాక్, ఇతర సీరియస్ అంశాల చుట్టూ తిరిగే స్టోరీతో సినిమా ఉండబోతున్నట్టు హింట్ ఇచ్చేశాడు. సుహాస్ అండ్ మ్యారేజ్ బ్యాండ్ టీం సాగించే ఫన్ రైడ్‌తో సినిమా ఉండబోతున్నట్టు టీజర్‌తో తెలిసిపోతుంది. ఈ మూవీలో పుష్ప ఫేం జగదీశ్ ప్రతాప్ బండారి, గోపరాజు రమణ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. గీతా ఆర్ట్స్ 2, మహాయణ మోషన్ పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి.

## రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో తండేల్




టాలీవుడ్‌లో త్వరలో సందడి చేయబోతున్న క్రేజీ కాంబోల్లో ఒకటి అక్కినేని నాగచైతన్య -చందూ మొండేటి. తాజాగా ఈ ఇద్దరూ రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో తండేల్ మూవీ చేస్తున్నారని తెలిసిందే. ఈ చిత్రంలో కోలీవుడ్ భామ సాయిపల్లవి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. మేకర్స్ ఇప్పటికే లాంఛ్ చేసిన చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో చైతూ మాస్ లుక్‌లో కనిపిస్తూ అభిమానులను ఖుషీ చేస్తున్నాడు. ఈ మూవీ షూటింగ్ అప్‌డేట్ బయటకు వచ్చింది. లైట్స్ ఆన్.. స్టార్ట్ కెమెరా.. యాక్షన్ అంటూ తండేల్ షూటింగ్ మొదలుపెట్టేసింది చైతూ టీం. నాగచైతన్య, ఇతర నటీనటులపై వచ్చే సన్నివేశాలను ఈ షెడ్యూల్‌లో చిత్రీకరిస్తున్నట్టు సమాచారం. తండేల్‌లో లవ్‌స్టోరీ తర్వాత చైతూ, సాయిపల్లవి కాంబోలో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈ మూవీలో సాయిపల్లవి శ్రీకాకుళం అమ్మాయిగా కనిపించనుంది. ఇప్పటికే తెలంగాణ యాసలో వినోదాన్ని పంచిన సాయిపల్లవి.. ఈ సారి శ్రీకాకుళం యాసలో పక్కా విలేజ్ గాళ్‌గా ఎలా అలరిస్తుందనేది చూడాలి మరి. 2018లో గుజరాత్ జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా ఈ చిత్రం వస్తున్నట్టు సమాచారం. చైతూ కెరీర్‌లోనే అత్యధికంగా రూ.70 కోట్ల భారీ బడ్జెట్‌తో వస్తున్నట్టు ఫిలింనగర్ సర్కిల్ టాక్. తండేల్‌కు అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. టాప్ బ్యానర్ గీతాఆర్ట్స్‌పై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు నిర్మిస్తున్నారు. కార్తికేయ, సవ్యసాచి, కార్తికేయ 2, ప్రేమమ్ సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న చందూమొండేటి నుంచి వస్తున్న సినిమా కావడం.. శ్రీకాకుళం బ్యాక్ డ్రాప్ స్టోరీ అవడంతో సినిమాపై అంచనాలు పెరిగిపోతున్నాయి.

## యూనిక్ కంటెంట్‌తో బబుల్‌గమ్



యూనిక్ కంటెంట్‌తో బబుల్‌గమ్‌రవికాంత్ పేరేపు దర్శకత్వంలో రోషన్ కనకాల హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'బబుల్ గమ్'. మానస చౌదరి హీరోయిన్‌గా నటిస్తోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలిసి మహేశ్వరి మూవీస్ నిర్మిస్తున్న ఈ సినిమా ఈనెల 29న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో హీరోయిన్ మానస చౌదరి మీడియాతో ముచ్చటించారు. నేను పుత్తూరులో పుట్టాను. చెన్నైలో పెరిగాను. నాన్న బిజినెస్ చేస్తారు. నాకు ఎలాంటి సినిమా నేపథ్యం లేదు. చదువు పూర్తయిన తర్వాత మోడలింగ్ స్టార్ట్ చేశాను. ఒక స్నేహితుడి ద్వారా దర్శకుడు రవికాంత్‌కి నా ప్రొఫైల్ పంపాను. ఆయనకి నచ్చడంతో ఈ సినిమా జర్నీ మొదలైంది. రవికాంత్ ఈ కథ చెప్పినపుడు చాలా నచ్చింది. 22 ఏళ్ల ఏజ్ గ్రూప్ వాళ్ళు ఎలా ఉంటారో అలానే అనిపించింది. చాలా రియలిస్టిక్‌గా ఉండే కథ. ఇందులోని సన్నివేశాలను బోల్డ్ అనడం కంటే చాలా బ్యూటీఫుల్‌గా ప్రజెంట్ చేశారని చెప్పాలి. ఈ కథ లవ్, రెస్పెక్ట్ గురించి ఉంటుంది. ఇందులో జాన్వి పాత్రలో కనిపిస్తా. నేనొక ఫ్యాషన్ డిజైనర్‌ని. నా పాత్ర ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకం ఉంది. ఇందులో కొన్ని ఇంటెన్స్ ఎమోషన్ ఉన్న సన్నివేశాలు ఉన్నాయి. ఆ ఇంటెన్స్‌ని కొనసాగించడం కొంత సవాల్‌గా అనిపించింది. జాన్వి పాత్రలో అన్ని ఎమోషన్స్ ఉన్నాయి. నటించడానికి ఆస్కారం ఉన్న పాత్ర దక్కడం చాలా ఆనందంగా ఉంది. ఈ కథ అందరికీ కనెక్ట్ అవుతుంది. రోషన్‌కి నటనపై మంచి పట్టు ఉంది. నిర్మాతలు ఎక్కడా రాజీపడకుండా సినిమాకి కావాల్సిన ప్రతీదీ సమకూర్చారు. సుమ సినిమా చూశారు. చాలా బాగా చేశానని చెప్పారు. ట్రైలర్, టీజర్ చూసిన ఆడియన్స్ కూడా చాలా అందంగా, సహజంగా కనిపిస్తున్నానని ప్రశంసించారు.

## క్లీంకారతో బిజీగా చెర్‌ఈ దంపతులు



రామ్ చరణ్ , ఉపాసన కామినేని దంపతులు ఇప్పుడు క్లీంకారతో బిజీగా ఉన్నారు. వీళ్ళిద్దరూ చాలామంది దంపతులకి స్ఫూర్తిదాయకంగా నిలిచారు. అలాగే ఇద్దరూ తమ వ్యక్తిగత పనులతో ఎంతో బిజీగా ఉంటూ కూడా పాప క్లీంకార కోసం ఇద్దరూ తమ కాలాన్ని వెచ్చిస్తున్నారు. అలాగే పండగలు వచ్చినప్పుడు కుటుంబ సభ్యులతో కాలం గడుపుతున్నారు, అందుకే వీళ్ళిద్దరూ బెస్ట్ కపుల్ అనే కాకుండా, బెస్ట్ పేరెంట్స్ అని కూడా అందరూ అంటున్నారు. క్రిస్మస్ పండగ సందర్భంగా రామ్ చరణ్, ఉపాసన ఇద్దరూ తమ పాపతో ఈ పండగని ఆనందంగా జరుపుకున్నారు. ఉపాసన తన ఇన్ స్టాగ్రామ్ లో కొన్ని ఫోటోస్ షేర్ చేశారు. అందులో రామ్ చరణ్, ఉపాసన పాపతో వున్న ఫోటోస్ కాకుండా, అల్లు అర్జున్, స్నేహ దంపతులతో వున్న ఫోటోస్ కూడా షేర్ చేశారు. అలాగే మెగా కుటుంబానికి సంబదించిన అందరితో క్రిస్మస్ పండగ ఎంత బాగా చేసుకున్నారు అన్న విషయం కూడా చెప్పడానికి అందరితో ఒక ఫోటో షేర్ చేశారు. స్నేహితురాలు అయిన నమ్రత శిరోద్కర్ తో కూడా వున్న ఫోటోని షేర్ చేశారు ఉపాసన. కుమార్తెతో వున్న ఫోటో ఇప్పుడు బాగా వైరల్ అవుతోంది అని అంటున్నారు.

## విడుదలకు సిద్ధంగా డెవిల్

సినీ లవర్స్.. ఈ డిసెంబర్ నెలను ఎంతగానో ఎంజాయ్ చేశారు. పాన్ ఇండియా రేంజ్‌లో యానిమల్, డంకీ, సలార్ వంటి భారీ బడ్జెట్ చిత్రాలు విడుదలై బ్లాక్‌బస్టర్ హిట్ కొట్టిన సంగతి తెలిసిందే. దీంతో ఇప్పుడు అందరి దృష్టి నందమూరి కళ్యాణ్ రామ్ స్పై థ్రిల్లర్ 'డెవిల్' సినిమాపై పడింది. ఈ ఏడాది భారీ అంచనాలతో వచ్చిన సినిమాలన్నీ బాక్సాఫీస్ దగ్గర సెన్సేషన్ క్రియేట్ చేశాయి. ఇప్పుడు అలాంటి అంచనాలతో 'డెవిల్' రానుండటంతో అందరిలో ఆసక్తి నెలకొంది.గత ఏడాది బింబిసార వంటి సోషియో ఫాంటసీ చిత్రంతో బ్లాక్ బస్టర్ సాధించాడు కళ్యాణ్ రామ్. ఈ ఏడాదిని 'డెవిల్'తో ఘనంగా పూర్తి చేయాలనుకుంటున్నాడు. ఇప్పటికే సినిమా నుంచి విడుదలైన పాటలు, టీజర్, ట్రైలర్‌లకు అద్భుత స్పందన లభించింది. బ్రిటీష్ కాలంలో గూఢచారి ఎలా ఉండేవారనే విషయాన్ని అసలు ఎవరూ ఊహించలేరు. అలాంటి కొత్త విషయాన్ని డెవిల్ మూవీలో ఆవిష్కరిస్తుండటం విశేషం. సెన్సార్ కార్యక్రమాలు కూడా పూర్తి చేసుకున్న ఈ చిత్రం యు/ఎ సర్టిఫికేట్‌ను పొందింది. 2 గంటల 26 నిమిషాలుగా డెవిల్ రన్ టైమ్‌ను ఫిక్స్ చేశారు. ప్రతి ఫ్రేమ్‌ని రిచ్‌గా అప్పటి బ్రిటీష్ కాలాన్ని ఆవిష్కరిస్తూ రూపొందించారు. మేకింగ్ పరంగా బడ్జెట్ విషయంలో నిర్మాత అభిషేక్ నామా ఎక్కడా రాజీపడలేదని స్పష్టమవుతోంది. సౌందర్ రాజన్ సినిమాటోగ్రఫీ, గాంధీ నడికుడికర్ ఆర్ట్ వర్క్ ఆకట్టుకుంటున్నాయి. హర్షవర్ధన్ రామేశ్వర్ అందించిన నేపథ్య సంగీతం వీటన్నింటినీ నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్లేలా ఉంది. డెవిల్ సినిమా ఈ నెల 29న తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ భాషల్లో రిలీజ్ చేస్తున్నారు. ఈ చిత్రానికి శ్రీకాంత్ విస్సా మాటలు, స్క్రీన్ ప్లే, కథను అందించారు. తమ్మిరాజు ఎడిటర్‌గా వర్క్ చేస్తున్నారు.

జనరల్ న్యూస్
GENERAL NEWS
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దినపత్రిక
బుధవారం,
15-05-2024


## ధోని అరుదైన రికార్డుకు చేరువలో రోహిత్ శర్మ



వన్డే ప్రపంచకప్– 2023 ఫైనల్ మ్యాచ్ లో ఓడిపోయిన తర్వాత విశ్రాంతి తీసుకున్న భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ తిరిగి మైదానంలో అడుగు పెట్టేందుకు రెడీ అవుతున్నాడు. సౌతాఫ్రికాతో టెస్టు సిరీస్‌లో టీమిండియాను హిట్‌మ్యాన్ ముందుండి నడిపించనున్నాడు. ఇక, రోహిత్‌తో పాటు సీనియర్ ఆటగాళ్లు విరాట్ కోహ్లి, జస్ప్రీత్ బుమ్రా సైతం ఈ సిరీస్‌లో భాగం కాబోతున్నారు. రేపటి నుంచి సెంచూరియన్ వేదికగా జరగబోతున్న తొలి టెస్టుతో ఈ సిరీస్ ప్రారంభం కానుంది. అయితే, తొలి టెస్టుకు ముందు టీమిండియా సారథి రోహిత్ శర్మను ఓ అరుదైన రికార్డు ఊరిస్తోంది. మొదటి టెస్టులో హిట్‌మ్యాన్ మరో 2 సిక్స్‌లు కొట్టినట్లైతే.. టెస్టు క్రికెట్‌లో అత్యధిక సిక్స్‌లు కొట్టిన రెండో భారతీయ ఆటగాడిగా రికార్డ్ సృష్టిస్తాడు. ఈ క్రమంలో టీమిండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనిని హిట్ మ్యాన్ అధిగమిస్తాడు. టెస్టుల్లో ఇప్పటి వరకు రోహిత్ శర్మ(77 సిక్స్‌లు), ధోని(78) సిక్స్‌లు కొట్టారు. ఇక, ఈ అరుదైన రికార్డు సాధించిన జాబితాలో టీమిండియా మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్(90) తొలి స్థానంలో ఉండగా, రెండు సిక్సులు కొడితే రోహిత్ శర్మ సెకండ్ ప్లేస్ లోకి వెళ్లాడు.

# లక్నోకు ఢిల్లీ షాక్..

### చెలరేగిన పోరెల్, స్టబ్స్

### ఈ ఫలితంతో ప్లేఆఫ్స్‌కు రాజస్థాన్



**న్యూఢిల్లీ:** గెలిచి తీరాల్సిన మ్యాచ్‌లో నిరాశపరిచిన లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ప్లేఆఫ్స్ ఆశలను దాదాపుగా దూరం చేసుకుంది. అటు తమ చివరి లీగ్ మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ఆల్‌రౌండ్‌షోతో మురిపించింది. అభిషేక్ పోరెల్ (33 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 58), ట్రిస్టన్ స్టబ్స్ (25 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 57 నాటౌట్) మెరుపు అర్ధసెంచరీలతో ఆకట్టుకోగా, మంగళవారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 19 పరుగులతో లఖ్‌నవూపై గెలిచింది. దీంతో 14 పాయింట్లతో ఐదో స్థానానికి చేరిన ఢిల్లీ సాంకేతికంగా రేసులో ఉన్నా.. నెట్‌రన్‌రేట్‌లో ఇతర జట్లకన్నా వెనుకంజలో ఉంది. అటు లఖ్‌నవూ తమ ఆఖరి మ్యాచ్ గెలిచి 14 పాయింట్లు సాధించినా ముందుకెళ్లడం దాదాపు అసాధ్యమే. ఇక ఢిల్లీ గెలుపుతో రాజస్థాన్ రాయల్స్ (16) ప్లేఆఫ్సుకు అర్హత సాధించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా ఢిల్లీ 20 ఓవర్లలో 4 వికెట్లకు 208 పరుగులు చేసింది. హోప్ (38), కెప్టెన్ పంత్ (33) ఫర్వాలేదనిపించారు. నవీనుల్‌కు 2 వికెట్లు దక్కాయి. ఛేదనలో లఖ్‌నవూ 20 ఓవర్లలో 9 వికెట్లకు 189 రన్స్ చేసి ఓడింది. నికోలస్ పూరన్ (27 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సర్లతో 61), అర్షద్ ఖాన్ (33 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్లతో 58 నాటౌట్) వేగంగా ఆడారు. 3 వికెట్లు తీసిన ఇషాంత్ శర్మ ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

ఛానల్ ఫాలో అవ్వండి

పూరన్, అర్షద్ పోరాటం: ఓ మాదిరి ఛేదనలో లఖ్‌నవూ తొలి ఓవర్ నుంచే తడబడింది. పూరన్, ఎనిమిదో నెంబర్ బ్యాటర్ అర్షద్ ఖాన్ పోరాటం ఆకట్టుకున్నా ఫలితం లేకపోయింది. ఇషాంత్ పదునైన బంతులకు రాహుల్ (5), డికాక్ (12), హుడా (0) వికెట్లను కోల్పోయింది. ఇక స్టొయినిస (5)ను అక్షర్ అవుట్ చేశాడు. 44 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన వేళ పూరన్ మాత్రం ఢిల్లీ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నాడు. నాలుగో ఓవర్‌లోనే అతను 4,6,4,6తో 20 రన్స్ రాబట్టాడు. ఆరో ఓవర్‌లోనూ 6,4 బాదడంతో జట్టు పవర్‌ప్లేలో 59/4తో నిలిచింది. ఆ తర్వాతా ఎడాపెడా బౌండరీలతో పూరన్ 20 బంతుల్లోనే ఫిఫ్టీ చేసినా.. మరోఎండ్‌లో అతడికి సహకారం అందలేదు. చివరకు 12వ ఓవర్‌లో నికోల్‌సను ముకేశ్ అవుట్ చేశాడు. బదోని (6), క్రునాల్ (18) నిరాశపర్చగా, అర్షద్ గెలుపుపై ఆశలు రేపాడు. 16వ ఓవర్‌లో యుధ్‌వీర్ (14) 4,6తో ఆకట్టుకోగా.. తర్వాతి ఓవర్‌లో అర్షద్ 6,6,4తో 18 రన్స్ అందించాడు. అదే ఓవర్‌లో యుధ్ వీర్ నిష్క్రమించినా, అర్షద్ ఓ సిక్సర్‌తో 25 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. కానీ ఆఖరి ఓవర్‌లో 23 రన్స్ అవసరమవగా రసిఖ్ 3 పరుగులే ఇచ్చి లఖ్‌నవూకు ఓటమి రుచి చూపించాడు.

ఆరంభంలో అభిషేక్.. ఆఖర్లో స్టబ్స్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ జోరంతా పవర్‌ప్లే.. డెత్ ఓవర్లలోనే సాగింది. ఓపెనర్ అభిషేక్ పోరెల్ ధనాధన్ బ్యాటింగ్‌తో చెలరేగాడు. ఆ తర్వాత మధ్య ఓవర్లలో స్పిన్నర్లను ఎదుర్కోవడంలో జట్టు తడబాటుకు లోనైంది. కానీ ఆఖర్లో స్టబ్స్ ఇన్నింగ్స్‌తో కాస్త పుంజుకున్న ఢిల్లీ ఆశించిన స్కోరు చేయగలిగింది. తొలి ఓవర్‌లోనే ఫ్రేజర్‌ను పేసర్ అర్షద్ డకౌట్ చేసి ఢిల్లీకి గట్టి షాకిచ్చాడు. కానీ పోరెల్ మాత్రం అతడి లోటును భర్తీ చేస్తూ చెలరేగాడు. మూడో ఓవర్‌లో 4,4,6,4తో 21 పరుగులు రాబట్టాడు. తర్వాతి ఓవర్‌లోనే హోప్ సైతం 4,4,6తో 16 రన్స్ అందించడంతో జట్టు కుదురుకుంది. ఇక ఆరో ఓవర్‌లో పోరెల్ 6,6,4తో పవర్‌ప్లేలో జట్టు 73/1 పరుగులతో పటిష్టంగానే కనిపించింది. కానీ ఆ తర్వాత స్పిన్నర్లు బిష్ణోయ్, క్రునాల్ ఢిల్లీని కట్టడి చేశారు. దీంతో దూకుడు మీదున్న పోరెల్ సైతం రన్స్ చేసేందుకు ఇబ్బందిపడ్డాడు. 21 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేసిన పోరెల్ ఆ తర్వాత మరో 8 రన్స్ చేసేందుకు 12 బంతులు తీసుకున్నాడు. హోప్‌ను బిష్ణోయ్ అవుట్ చేయడంతో రెండో వికెట్‌కు 92 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. కాసేపటికే పేసర్ నవీనుల్.. పోరెల్‌ను వెనక్కిపంపాడు. ఈ దశలో కెప్టెన్ పంత్, స్టబ్స్ నాలుగో వికెట్‌కు 47 పరుగులు జత చేశారు. స్టబ్స్ డెత్ ఓవర్లలో మరింత చెలరేగాడు. 16వ ఓవర్‌లో 6,4,4తో 18 రన్స్.. 19వ ఓవర్‌లో 4,6,6తో 21 రన్స్ అందించి స్కోరు బోర్డును పరిగెత్తించడంతో పాటు 22 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. అలాగే ఆఖరి ఓవర్‌లో స్టబ్స్, అక్షర్ (14 నాటౌట్) ఇచ్చిన క్యాచ్‌లను బిష్ణోయ్ వదిలేయగా డీసీ స్కోరు 200 దాటింది.

### స్కోరుబోర్డు

ఢిల్లీ: ఫ్రేజర్ (సి) నవీనుల్ (బి) అర్షద్ 0, అభిషేక్ పోరెల్ (సి) పూరన్ (బి) నవీనుల్ 58, హోప్ (సి) రాహుల్ (బి) బిష్ణోయ్ 38, పంత్ (సి) హుడా (బి) నవీనుల్ 33, స్టబ్స్ (నాటౌట్) 57, అక్షర్ (నాటౌట్) 14, ఎక్స్‌ట్రాలు: 8బీ మొత్తం: 20 ఓవర్లలో 208/4బీ వికెట్ల పతనం: 1-2, 2-94, 3-111, 4-158బీ బౌలింగ్: అర్షద్ 3-0-45-1, మొహిసిన్ 4-0-29-0, యుధ్‌వీర్ 2-0-28-0, నవీనుల్ 4-0-51-2, బిష్ణోయ్ 4-0-26-1, క్రునాల్ 2-0-20-0, దీపక్ హుడా 1-0-9-0.

లఖ్‌నవూ: డికాక్ (సి) ముకేశ్ (బి) ఇషాంత్ 12, రాహుల్ (సి) ముకేశ్ (బి) ఇషాంత్ 5, స్టొయినిస్ (స్టంప్డ్) పంత్ (బి) అక్షర్ 5, దీపక్ హుడా (ఎల్బీ) ఇషాంత్ 0, పూరన్ (సి) అక్షర్ (బి) ముకేశ్ 61, బదోని (సి) గుల్బదిన్ (బి) స్టబ్స్ 6, క్రునాల్ (స్టంప్డ్) పంత్ (బి) కుల్దీప్ 18, అర్షద్ (నాటౌట్) 58, యుధ్‌వీర్ (సి) హోప్ (బి) ఖలీల్ 14, బిష్ణోయ్ (రనౌట్) 2, నవీనుల్ (నాటౌట్) 2, ఎక్స్‌ట్రాలు: 6బీ మొత్తం: 20 ఓవర్లలో 189/9బీ వికెట్ల పతనం: 1-7, 2-24, 3-24, 4-44, 5-71, 6-101, 7-134, 8-167, 9-183బీ బౌలింగ్: ఇషాంత్ 4-0-34-3, ఖలీల్ 2-0-22-1, అక్షర్ 1-0-20-1, ముకేశ్ 4-0-33-1, కుల్దీప్ 4-0-33-1, స్టబ్స్ 1-0-4-1, గుల్బదిన్ 1-0-12-0, రసిఖ్ 3-0-30-0.

# రాజస్థాన్‌కు కీలకం

### నేడు పంజాబ్‌తో పోరు



గౌహతి: వరుస ఓటములతో సతమతమవుతున్న రాజస్థాన్ రాయల్స్‌కు బుధవారం పంజాబ్ కింగ్స్‌తో జరిగే మ్యాచ్ కీలకంగా మారింది. రాజస్థాన్ వరుసగా మూడు మ్యాచుల్లో పరాజయం పాలైంది. దీంతో జట్టు తీవ్ర ఒత్తిడిలో కనిపిస్తోంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే రాజస్థాన్‌కు ప్లేఆఫ్ బెర్త్ సొంతమవుతుంది. అయితే వరుస పరాజయాలు చవిచూస్తున్న రాజస్థాన్‌కు ఈ మ్యాచ్ సవాల్ వంటిదేనని చెప్పాలి. హైదరాబాద్, ఢిల్లీ, చెన్నైలతో జరిగిన చివరి మూడు పోటీల్లో రాజస్థాన్‌కు పరాజయాలు ఎదురయ్యాయి. చెన్నైతో జరిగిన కిందటి మ్యాచ్‌లో బ్యాటింగ్ వైఫల్యం జట్టును వెంటాడింది. స్టార్ ఆటగాళ్లతో కూడిన రాజస్థాన్ చెన్నై కేవలం 141 పరుగులు మాత్రమే చేసింది. అద్భుత ఫామ్‌లో ఉన్న యశస్వి జైస్వాల్, జోస్ బట్లర్, కెప్టెన్ సంజు శాంసన్ తదితరులు ఈ మ్యాచ్‌లో విఫలమయ్యారు. వీరి వైఫల్యం జట్టుపై బాగానే ప్రభావం చూపించింది. ఈ మ్యాచ్‌లోనైనా వీరు తమ తమ బ్యాట్లకు పని చెప్పాల్సిన అవసరం ఉంది. మరోవైపు చెన్నైపై రాణించిన రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్ తదితరులు ఈసారి కూడా సత్తా చాటాలనే పట్టుదలతో ఉన్నారు. బౌలింగ్‌లో కూడా రాజస్థాన్ బాగానే ఉంది. ఆరంభంలో వరుస విజయాలతో పెను ప్రకంపనలు సృష్టించిన రాజస్థాన్ వరుసగా మూడు మ్యాచుల్లో ఓడి ఆత్మరక్షణలో పడింది. అయితే ఈ మ్యాచ్‌లో గెలిచి మళ్లీ గాడిలో పడాలనే పట్టుదలతో ఉంది. మరోవైపు పంజాబ్ ఇప్పటికే నాకౌట్ రేసు నుంచి నిష్క్రమించింది. రాజస్థాన్‌పై గెలిచి కాస్తయినా పరువును కాపాడుకోవాలని భావిస్తోంది. చెన్నై, బెంగళూరులతో జరిగిన చివరి రెండు మ్యాచుల్లో పంజాబ్ ఓటమి పాలైంది. ఈ సీజన్‌లో పూర్తిగా నిరాశ పరిచింది. 12 మ్యాచుల్లో కేవలం నాలుగింటిలో మాత్రమే గెలిచింది. వరుస ఓటములతో ఇప్పటికే నాకౌట్ రేసుకు దూరమైంది. అయితే మిగిలిన రెండు మ్యాచులో ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో పంజాబ్ ఉంది. ఇందులో ఎంత వరకు సఫలమవుతుందో వేచి చూడాల్సిందే.

## గోయెంకా దిద్దుబాటు చర్యలు



### గోయెంకా దిద్దుబాటు చర్యలు

### రాహుల్‌తో ప్రత్యేక విందు

**న్యూఢిల్లీ:** కెప్టెన్ కేఎల్ రాహుల్‌పై బహిరంగంగా ఆగ్రహం వ్యక్తంజేసి వివాదంలో కూరుకుపోయిన లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ యజమాని సంజీవ్ గోయెంకా దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఈక్రమంలో సోమవారం రాత్రి కేఎల్ రాహుల్‌ను ఆయన ప్రత్యేకంగా విందుకు ఆహ్వానించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గత బుధవారం సన్‌రైజర్స్ చేతిలో లఖ్‌నవూ 10 వికెట్లతో ఓడిన అనంతరం గ్రౌండ్‌లోకి వచ్చిన సంజీవ్ గోయెంకా కెప్టెన్ రాహుల్‌పై ఆగ్రహం వ్యక్తంజేయడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.

## ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ బోర్డు ముగ్గురు ఆటగాళ్లపై భారీ చర్యలు



ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ బోర్డు తన ముగ్గురు ఆటగాళ్లపై భారీ చర్యలు తీసుకుంది. ఫ్రాంచైజీ క్రికెట్ ఆడకుండా ముగ్గురు ఆటగాళ్లపై నిషేధం విధించింది. ముగ్గురు ఆటగాళ్లు ముజీబ్ ఉర్ రెహ్మాన్, నవీన్ ఉల్ హక్, ఫజల్ ఫరూఖీలను జాతీయ కాంట్రాక్టు నుంచి విడుదల చేయాలన్న అభ్యర్థనను ఆఫ్ఘనిస్థాన్ క్రికెట్ బోర్డు తిరస్కరించింది. ఇది కాకుండా, ఈ ముగ్గురు ఆటగాళ్లపై బోర్డు క్రమశిక్షణా చర్యలు తీసుకుంది. ఈ ముగ్గురు ఆటగాళ్ల సెంట్రల్ కాంట్రాక్టులను కూడా నిలిపివేసింది. దీంతో పాటు వచ్చే రెండేళ్లపాటు ఈ ఆటగాళ్లకు ఎన్ఓసీ ఇవ్వకూడదని కూడా నిర్ణయించారు. ఇప్పటికే ఉన్న ఏదైనా  రద్దు చేయడం కూడా ఇందులో పేర్కొంది. ముజీబ్ ఉర్ రెహ్మాన్, నవీన్ ఉల్ హక్, ఫజల్ ఫరూఖీలు ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ లీగ్‌లలో ఆడేందుకు నేషనల్ సెంట్రల్ కాంట్రాక్ట్‌ను విడుదల చేయాలని ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ బోర్డును అభ్యర్థించారు. ముగ్గురు ఆటగాళ్లు తమ నిర్ణయాన్ని బోర్డుకు తెలియజేశారు. జనవరి 1, 2024 నుంచి ప్రారంభమయ్యే సెంట్రల్ కాంట్రాక్ట్ నుంచి తమను తాము విడుదల చేయాలనే కోరికను వ్యక్తం చేశారు. జాతీయ ఈవెంట్‌లలో పాల్గొనడానికి వారి సమ్మతిని పరిగణనలోకి తీసుకోవాలని అభ్యర్థించారు. జాతీయ జట్టుకు ప్రాధాన్యత ఇవ్వకుండా లీగ్ టోర్నీలో ఆడేందుకు ఈ ముగ్గురు ఆటగాళ్లు ప్రాధాన్యత ఇవ్వడంపై బోర్డు ఆగ్రహం వ్యక్తం చేసింది. ముగ్గురు ఆటగాళ్ల సెంట్రల్ కాంట్రాక్టులను నిలిపివేస్తున్నట్లు ఆఫ్ఘనిస్థాన్ క్రికెట్ బోర్డు అధికారికంగా ప్రకటన విడుదల చేసింది. బోర్డు విడుదల చేసిన ఒక ప్రకటనలో, ఈ ముగ్గురు ఆటగాళ్లు ఆఫ్ఘనిస్తాన్‌కు ఆడటం కంటే వాణిజ్య లీగ్, వారి వ్యక్తిగత ప్రయోజనాలపై ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారని పేర్కొంది. వీరు జాతీయ జట్టుకు ప్రాధాన్యత ఇవ్వడం లేదంటూ పేర్కొంది. ఏసిబీ నిర్ణయం ఈ ముగ్గురు ఆటగాళ్లు ఆడడాన్ని కూడా ప్రభావితం చేయవచ్చు. అఫ్గానిస్తాన్ క్రికెట్ బోర్డు ఇచ్చిన ప్రస్తుత ఆర్డర్ భవిష్యత్తులో ముజీబ్ ఉర్ రెహ్మాన్, నవీన్ ఉల్ హక్, ఫజల్ ఫారూఖీ  ఆడడాన్ని కూడా ప్రభావితం చేయవచ్చు. అయితే, ఏసీబీ కూడా ప్రస్తుత ఎన్ఓసీని రద్దు చేయలేదు. అయితే, ఈ ముగ్గురు ఆటగాళ్లకు రెండేళ్లపాటు ఎన్ఓసీ ఇవ్వకూడదని ఏసీబీ తన ఆర్డర్‌లో నిర్ణయించింది. ఇప్పటికే ఉన్న ఏదైనా ని రద్దు చేయడం కూడా ఇందులో ఉంటుంది. ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టులో ముజీబ్ ఉర్ రెహ్మాన్ చోటు దక్కించుకున్నాడు. నవీన్ ఉల్ లక్నో సూపర్ జెయింట్స్ తరపున ఆడుతుండగా, ఫజల్ ఫరూఖీ సన్ రైజర్స్ హైదరాబాద్ తరపున ఆడుతున్నారు. 24 ఏళ్ల ఫాస్ట్ బౌలర్ భారత్‌లో జరిగిన వన్డే ప్రపంచకప్ తర్వాత వన్డే నుంచి రిటైర్ అయ్యాడు. వరల్డ్ కప్ సందర్భంగా నవంబర్ 7న లీగ్‌లో ఆస్ట్రేలియాతో నవీన్ తన చివరి వన్డే ఆడాడు. వన్డే ప్రపంచకప్‌లో ఆఫ్ఘనిస్థాన్ అద్భుత ప్రదర్శన చేసింది. భారత్‌లో జరిగిన వన్డే ప్రపంచకప్‌లో అఫ్గానిస్థాన్ జట్టు ఊహించిన దానికంటే మెరుగైన ప్రదర్శన చేసింది. ఆ జట్టు 9 మ్యాచ్‌ల్లో 4 గెలిచింది. ఆఫ్ఘన్ జట్టు ఇంగ్లండ్, పాకిస్థాన్, శ్రీలంక, నెదర్లాండ్స్‌ను ఓడించింది. పాకిస్థాన్‌పై 8 వికెట్ల తేడాతో ఆఫ్ఘనిస్తాన్, 7 వికెట్ల తేడాతో శ్రీలంక, 69 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై విజయం సాధించింది.

## టైటాన్స్ ఆశలపై 'నీళ్లు'

## ప్లేఆఫ్స్ నుంచి గుజరాత్ అవుట్

### వరుణుడి ఆటంకం జూ కోల్‌కతాతో మ్యాచ్ రద్దు

అహ్మదాబాద్: గుజరాత్ టైటాన్స్ ప్లేఆఫ్స్ ఆశలపై వరుణుడు నీళ్లు చల్లాడు. సోమవారం కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరగాల్సిన మ్యాచ్ కనీసం టాస్ కూడా పడకుండానే రద్దయ్యింది. దీంతో ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయించారు. ప్రస్తుతం 11 పాయింట్లతో ఉన్న టైటాన్స్ ముందుకెళ్లేందుకు ఎలాంటి అవకాశం లేకపోవడంతో అధికారికంగా రేసు నుంచి నిష్క్రమించింది. 2022లో టైటాన్స్ తమ ఆరంభ సీజన్‌లోనే చాంపియన్‌గా నిలిచి సంచలనం సృష్టించగా.. తర్వాతి ఏడాది కూడా ఫైనల్‌కు చేరగలిగింది. కానీ ఈసారి కొత్త కెప్టెన్ గిల్ ఆధ్వర్యంలో జట్టు లీగ్ దశలోనే ఇంటిముఖం పట్టి నిరాశపరిచింది. అటు కోల్‌కతా 19 పాయింట్లతో టాప్-2లో చోటు ఖాయం చేసుకుంది. టాస్ వేయడానికి ముందే ఉరుములు, మెరుపులతో ఆకాశం బీభత్సంగా మారింది.

**PRINTED, PUBLISHED & OWNED BY** G.JANARDHAN REDDY, H.NO, 16-11-511/B/7,OPP : STREET KRISHINANDA MATAM, DILSUKHNAGAR, HYDERABAD-36. PRINTED AT y.v. reddy, binding works, h.no.5-20, shivani hotel line, gurga nagar, Hyderabad-36, Telangana.Editor G.JANARDHAN REDDY, RNI NO. **APTEL/2007/22828** CELL: 9948789066